# శుభోదయం

WWW.SUBHODAYAMDAILY.COM

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 147, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శుక్రవారం -08 - ఆగష్టు - 2025


## మా ఆఖరి పోరాటం పూర్తి చేశాం..
# ఇక నిర్ణయం కేంద్రానిదే

బీసీ రిజర్వేషన్లను ఆ రెండు పార్టీలు అడ్డుకుంటున్నాయి

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు 3 మార్గాలు

రిజర్వేషన్లలో విద్యా ఉద్యోగ అవకాశాలకు మాత్రమే వర్గీకరణ ఉంటుంది

పొలిటికల్ రిజర్వేషన్లలో ఉపవర్గీకరణ లేదు

బీసీ మొత్తానికి కలిపి 42 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి



ఢిల్లీ: బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. రిజర్వేషన్లలో విద్యా ఉద్యోగ అవకాశాలకు మాత్రమే వర్గీకరణ ఉంటుందని, ఆయన(కిషన్ రెడ్డి) చెప్పినట్లు ప్రత్యేక వర్గానికి రిజర్వేషన్లేం లేవని అన్నారాయన. ఢిల్లీలో గురువారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ మాట్లాడారు. "రిజర్వేషన్లలో విద్యా ఉద్యోగ అవకాశాలు మాత్రమే ఏబీసీడీ వర్గీకరణ ఉంది. పొలిటికల్ రిజర్వేషన్లలో ఉపవర్గీకరణ లేదు. బీసీ మొత్తానికి కలిపి 42 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఒక ప్రత్యేక వర్గానికి రిజర్వేషన్లు లేవు. కిషన్ రెడ్డి ముందుగా చట్టం చదవాలి. రాజకీయ ఓబీసీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ లేదు. బీసీఈ గ్రూపుకు ఇప్పటికే నాలుగు శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. అలాంటప్పుడు కొత్తగా 10% రిజర్వేషన్లు ఎక్కడి నుంచి వచ్చాయి. కిషన్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు" అని సీఎం రేవంత్ అన్నారు. రిజర్వేషన్ సాధన కోసం పూర్తి స్థాయిలో ప్రయత్నాలు మిగతా..2లో

## డోంట్ కేర్ ట్రంప్... భారత పర్యటనకు వస్తున్న పుతిన్!

రష్యా నుంచి ఆయిల్ కొంటున్నారంటూ భారత్ పై ట్రంప్ సుంకాలు

ట్రంప్ ను పట్టించుకోని భారత్, రష్యా

ఈ నెలాఖరున భారత్ లో పర్యటించనున్న పుతిన్!



## ఒవైసీ, అజారుద్దీన్, షబ్బీర్ అలీ వంటి వారు బీసీలు ఎలా అవుతారు?



మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమన్న కిషన్ రెడ్డి

ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ల అంశం తీసివేయాలని సూచన

రాష్ట్రపతి, ప్రధానిలతో తాను స్వయంగా మాట్లాడతానని వ్యాఖ్య

## కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వం



బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామన్న పొన్నం ప్రభాకర్

ముస్లింల పేరుతో అడ్డుకోవడం సరికాదని వ్యాఖ్య

ఉత్తరాదిన అనేక రాష్ట్రాల్లో బీజేపీని బీసీలు తిరస్కరించారన్న పొన్నం

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి మిగతా..2లో

## బీసీ బిల్లుపై పార్లమెంట్‌లో ఒత్తిడి పెంచండి.. ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. పార్లమెంట్‌లోని రాజ్యసభ విపక్ష నేత ఛాంబర్‌కు వెళ్లిన సీఎం బృందం బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ఒత్తిడి పెంచాలని కోరింది. బీసీ పోరుబాట ధర్నా, ఇతర కార్యక్రమాల గురించి ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. రాష్ట్రంలో కుల గణన జరిగిన తీరు, అసెంబ్లీలో బిల్లుల ఆమోదం అంశాలను వివరించారు. బిల్లులను ఆమోదించాలని కోరుతూ రాష్ట్రపతి అపాయింట్‌మెంట్‌కు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు ఇండియా కూటమి పార్టీల ఎంపీలు సంఘీభావం తెలిపిన విషయాన్ని ఖర్గేకు సీఎం తెలిపారు.



## ఘనాలో కూలిన హెలికాప్టర్..

ఇద్దరు మంత్రుల సహా కీలక అధికారుల దుర్మరణం

రక్షణ మంత్రి, పర్యావరణ మంత్రి సహా మొత్తం ఎనిమిది మంది మృతి

టేకాఫ్ అయిన కాసేపటికే కమ్యూనికేషన్ కట్

సాంకేతిక లోపంతోనే కూలినట్లు ప్రకటించిన ప్రభుత్వం

## రైతుల కోసం ఎంతటి మూల్యమైనా చెల్లిస్తా..
### అమెరికాకు ప్రధాని మోదీ గట్టి కౌంటర్

భారత ఎగుమతులపై మరో 25 శాతం సుంకం పెంచిన అమెరికా

రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్న ప్రధాని మోదీ

దేశ రైతుల కోసం భారత్ సిద్ధంగా ఉందన్న ప్రధాని



ఢిల్లీ: దేశ రైతుల ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదని, వారి కోసం ఎంతటి మూల్యం చెల్లించడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసిన మరుసటి రోజే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నందుకు ప్రతీకార చర్యగా భారత ఎగుమతులపై అమెరికా బుధవారం అదనంగా మిగతా..2లో

## రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ' కామెంట్స్‌లో ట్విస్ట్.. తప్పని తేలితే శిక్షే

ఓట్ చోరీ పేరుతో రాహుల్ గాంధీ ప్రజెంటేషన్

మహారాష్ట్ర,కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయంటూ రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

తప్పుడు ఆధారాలు సమర్పిస్తే, 1950 ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం శిక్ష పడే అవకాశం ఉందని

ఆ నియోజకవర్గంలో లక్ష నకిలీ ఓట్లు.. ఆధారాలివే



బెంగళూరు: బీజేపీ కోసమే కేంద్ర ఎన్నికల సంఘం ఓట్లను చోరీ చేస్తోందంటూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణల్లో ట్విస్ట్ చోటు చేసుకుంది. ఓట్ చోరీ పేరుతో రాహుల్ గాంధీ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ ప్రజెంటేషన్‌లో చూపించిన ఆధారాలు తప్పని తేలితే శిక్ష పడే అవకాశం ఉందని తెలుపుతూ కర్ణాటక రాష్ట్ర ఎన్నికల సంఘం రాహుల్ గాంధీకి లేఖ రాసింది. మహారాష్ట్ర,కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఎత్తున అవకతవకలు మిగతా..2లో

## బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుంది...



### అందరి లెక్కలు సరిచేస్తాం: కేటీఆర్

రేవంత్ పాలన విచిత్రంగా ఉందన్న కేటీఆర్

రాష్ట్రంలో భూముల విలువ పడిపోయిందని వ్యాఖ్య

కేసీఆర్ అంటే రేవంత్ భయపడుతున్నారన్న రేవంత్

## బ్రాహ్మణి కట్టిన చీర చూసి 90 మంది కొన్నారు..
### ఇదే చేనేత గొప్పతనం!

మంగళగిరిలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి లోకేశ్

చేనేతల ఆదాయం 30 శాతం పెంచేలా చర్యలు తీసుకున్నామని వెల్లడి

మంగళగిరిలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ పనిచేస్తోందన్న లోకేశ్



అమరావతి: "నా భార్య బ్రాహ్మణి కట్టుకున్న చేనేత చీర బాగుందని, అది ఎక్కడ కొన్నారని ఆరా తీసి మరీ ఒకే దుకాణంలో 90 మంది కొనుగోలు చేశారు. ఇదే చేనేత కళకు ఉన్న ఆదరణ, దానికున్న మిగతా..2లో

# రాజధాని అమరావతిలో చేనేత మ్యూజియం ఏర్పాటుకు హామీ

### నేతన్నలకు 50 ఏళ్లకే పెన్షన్: సీఎం చంద్రబాబు


మంగళగిరిలో 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తామని ప్రకటన

మరమగ్గాలకు సబ్సిడీలు, ఉచిత విద్యుత్ యూనిట్ల పెంపు

ప్రభుత్వ నిర్ణయాలతో 93 వేల కుటుంబాలకు ప్రయోజనం



మంగళగిరి: చేనేత కార్మికులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేస్తూ, వారికి 50 ఏళ్ల వయసు నుంచే పెన్షన్ అందించాలని నిర్ణయించినట్లు కీలక ప్రకటన చేశారు. నేతన్నలు చిన్న వయసులోనే అనారోగ్యాల బారినపడుతున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేతలే ప్రతీకలని ముఖ్యమంత్రి కొనియాడారు. వారి ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని పెన్షన్ వయసును తగ్గించినట్లు వివరించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన 11వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతిలో చేనేత వస్త్ర వైభవాన్ని చాటిచెప్పేలా ఒక ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మిగతా..2లో

# డోంట్ కేర్ ట్రంప్... భారత పర్యటనకు వస్తున్న పుతిన్!

ఢిల్లీ: రష్యా నుంచి ముడిచమురు కొంటున్నారనే కారణంతో భారత్ పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఏదో ఒక విధంగా భారత్ ను రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయకుండా చూడాలనే యోచనలో ట్రంప్ ఉన్నారు. అయితే, ఇవేవీ భారత్-రష్యా స్నేహ బంధంపై ప్రభావం చూపలేకపోయాయి. రష్యా అధినేత ట్రంప్ త్వరలోనే భారత పర్యటనకు రానున్నారు. ఈ విషయాన్ని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వెల్లడించారు. ప్రస్తుతం దోవల్ మాస్కోలో ఉన్నారు. పుతిన్ భారత పర్యటన తేదీలు ఖరారు కానప్పటికీ... ఈ నెలాఖరు ఆయన భారత పర్యటన ఉండొచ్చని 'ఇంటర్ ఫ్యాక్స్ న్యూస్ ఏజెన్సీ' తెలిపింది. భారత్ పై మరో 25 శాతం సుంకాలు పెంచుతూ నిన్ననే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పై ట్రంప్ సంతకం చేశారు. ఇది జరిగిన ఒక్క రోజు వ్యవధిలోనే భారత పర్యటకు పుతిన్ వస్తున్నారనే వార్త అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

# ఒవైసీ, అజారుద్దీన్, షబ్బీర్ అలీ వంటి వారు బీసీలు ఎలా అవుతారు?

హైదరాబాద్: మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లను తీసివేస్తే... తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో తాను వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ల అంశాన్ని తొలగిస్తే, తాను స్వయంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీలతో మాట్లాడతానని కిషన్ రెడ్డి చెప్పారు. బీసీ రిజర్వేషన్లతో ముస్లింలను ఎలా ముడిపెడతారని ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచించుకోవాలని సూచించారు. అసదుద్దీన్ ఒవైసీ, అజారుద్దీన్, షబ్బీర్ అలీ వంటి వారు బీసీలు ఎలా అవుతారని ప్రశ్నించారు.

# బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది... అందరి లెక్కలు సరిచేస్తాం: కేటీఆర్

హైదరాబాద్: రాబోయే రెండున్నరేళ్లలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని... అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పాలన విచిత్రంగా ఉందని... ఏం చేస్తున్నారో ఆయనకే అర్థం కావడం లేదని అన్నారు. యూరియా కోసం రైతులు కష్టపడాల్సి వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో భూముల విలువలు పడిపోయాయని అన్నారు. బీఆర్ఎస్ పాలనా సమయంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని ఐఏఎస్ అధికారులు అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఐఏఎస్ అధికారులు రాజకీయాలు మాట్లాడటం సరికాదని అన్నారు. తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రుణమాఫీ విషయంలో రేవంత్ ప్రభుత్వం విఫలమయిందని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతుబంధును ప్రభుత్వం నిలిపివేస్తుందని చెప్పారు. కేసీఆర్ అంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని... అందుకే ఢిల్లీలో కూడా కేసీఆర్ నే విమర్శిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన మంచి పనులను తమ పార్టీ కార్యకర్తలు ప్రజలకు చెప్పలేకపోయారని... అందుకే ఓడిపోయామని చెప్పారు. కేసీఆర్ ను మళ్లీ సీఎం చేసుకునేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# ఘనాలో కూలిన హెలికాప్టర్.. ఇద్దరు మంత్రుల సహా కీలక అధికారుల దుర్మరణం

ఢిల్లీ: పశ్చిమాఫ్రికా దేశం ఘనాలో నిన్న ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కేంద్ర మంత్రులు, కీలక అధికారులతో బయలుదేరిన సైనిక హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో దేశ రక్షణ మంత్రి, పర్యావరణ మంత్రి, కీలక అధికారులు సహా మొత్తం ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. రాజధాని అక్రా నుంచి ఒబువాసి వెళ్లడానికి రక్షణ మంత్రి ఎడ్వర్డ్ ఒమానే బోమా, పర్యావరణ శాఖ మంత్రి ఇబ్రహీం ముర్తాలా ముహమ్మద్ అధికారులతో కలిసి జెడ్-9 అనే సైనిక హెలికాప్టర్ లో బయలుదేరారు. కాసేపటికే హెలికాప్టర్ తో కమ్యూనికేషన్ తెగిపోయిందని, ఆ తర్వాత హెలికాప్టర్ కూలిపోయిందనే సమాచారం అందిందని అధికారులు వివరించారు. ఈ ప్రమాదంలో హెలికాప్టర్లో ప్రయాణం చేస్తున్న వారంతా చనిపోయారని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మృతదేహాలను వెలికి తీసి ఆసుపత్రికి తరలించినట్టు అధికారులు తెలిపారు. హెలికాప్టర్ కూలడానికి గల కారణాలు ఇంకా తెలియలేదని, నిపుణుల బృందం దీనిపై దర్యాప్తు మొదలుపెట్టిందని వివరించారు. సాంకేతిక లోపం కారణంగానే హెలికాప్టర్ కుప్పకూలినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ప్రమాదాన్ని ఘనా ప్రభుత్వం జాతీయ విషాదంగా ప్రకటించింది.

# కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వం

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లాలకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. ధర్నా శిబిరానికి ఢిల్లీలోని పలువురు పార్టీ పెద్దలు తరలి వచ్చారు. కాసేపటి క్రితం ఢిల్లీలో మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వబోమని అన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లుపై తీర్మానం చేసే సందర్భంలోనే కిషన్ రెడ్డి దానికి వ్యతిరేకంగా అభిప్రాయం చెప్పి ఉంటే... ఆరోజు చర్చ జరిగేదని చెప్పారు. ఆ బిల్లు చట్ట రూపం దాల్చి, గవర్నర్ ఆమోదంతో ఢిల్లీకి వచ్చిన తర్వాత... ముస్లింల పేరుతో దాన్ని అడ్డుకోవడం సరికాదని అన్నారు. కిషన్ రెడ్డిని కూడా బహిరంగ చర్చకు ఆహ్వానించదలుచుకున్నామని చెప్పారు. లోక్ సభ ఎన్నికల్లో చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా బీజేపీ గెలిచిందని పొన్నం ఎద్దేవా చేశారు. ఉత్తరాదిన అనేక రాష్ట్రాల్లో బీజేపీని బీసీలు తిరస్కరించారని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు.

# రాజధాని అమరావతిలో చేనేత మ్యూజియం ఏర్పాటుకు హామీ

మొదటి పేజి తరువాయి



ఈ సందర్భంగా రాజధాని అమరావతిలో చేనేత వస్త్ర వైభవాన్ని చాటిచెప్పేలా ఒక ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక ఉపాధి కల్పిస్తున్న చేనేత రంగానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ మద్దతు ఇస్తుందని తెలిపారు. గతంలో 55,500 మంది కార్మికులకు రూ. 27 కోట్ల రుణాలు అందించామని, 90,765 కుటుంబాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. ఈ మద్దతును మరింత విస్తరిస్తూ మరమగ్గాల కార్మికులకు కూడా ప్రభుత్వం అండగా నిలుస్తుందని చంద్రబాబు ప్రకటించారు. మరమగ్గాలకు 50 శాతం సబ్సిడీతో రూ. 80 కోట్లు కేటాయిస్తున్నామని, వారికి ఈ నెల నుంచే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో దీనిని 500 యూనిట్లకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ చర్యల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93 వేల చేనేత, మరమగ్గాల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, సవితతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, చేనేత సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల కోసం ఎంతటి మూల్యమైనా చెల్లిస్తా..

మొదటి పేజి తరువాయి



ప్రతీకార చర్యగా భారత ఎగుమతులపై అమెరికా బుధవారం అదనంగా 25 శాతం సుంకాన్ని విధించిన విషయం తెలిసిందే. గత నెల 20న విధించిన 25 శాతంతో కలిపి ఇప్పుడు మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరిగిన ఎం.ఎస్. స్వామినాథన్ శతాబ్ది అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడారు. "రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలే మాకు అత్యంత ప్రాధాన్యం. ఈ విషయంలో భారత్ ఎన్నటికీ రాజీపడదు. ఇందుకోసం నేను వ్యక్తిగతంగా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని తెలుసు. అయినా నేను సిద్ధంగా ఉన్నాను. దేశ రైతుల కోసం భారత్ సిద్ధంగా ఉంది" అని ఆయన తేల్చిచెప్పారు. అమెరికా చర్యపై భారత విదేశాంగ శాఖ కూడా తీవ్రంగా స్పందించింది. రష్యా చమురు దిగుమతుల విషయంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం "అన్యాయమైన, అహేతుకమైన చర్య" అని పేర్కొంది. దేశ ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని స్పష్టం చేసింది. 140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రతను దృష్టిలో ఉంచుకునే తమ దిగుమతులు ఉంటాయని తెలిపింది.

# మా ఆఖరి పోరాటం పూర్తి చేశాం.. ఇక నిర్ణయం కేంద్రానిదే

మొదటి పేజి తరువాయి



రిజర్వేషన్ సాధన కోసం పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నామని రేవంత్ ఉద్ఘాటించారు. "బీసీ రిజర్వేషన్‌లు 42 శాతం ఇవ్వాలన్నది మా కమిట్‌మెంట్. మా కమిట్మెంట్‌కు విపక్షాల సర్టిఫికెట్ అవసరం లేదు. జంతర్ మంతర్ వేదికగా మావాయిస్ బలంగా వినిపించాం. మా ఆఖరి పోరాటాన్ని పూర్తి చేశాం. నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్రంలోని బీజేపీనే. బీసీలపై అంత ప్రేమ ఉంటే కేంద్రం వెంటనే బిల్లు ఆమోదించాలి. అబద్ధాలతో ప్రజల్ని మభ్య పెట్టడం బీఆర్ఎస్ నైజం. లోకల్‌బాడీ ఎన్నికలు సెప్టెంబర్ 30లోపు నిర్వహించాలని హైకోర్టు చెప్పింది. ఆలోపు బీసీ రిజర్వేషన్లకు కేంద్రం ఆమోదం తెలపకపోతే ఎలా ముందుకు వెళ్లాలన్నదానిపై ఆలోచన చేస్తాం. ప్రజల అభీష్టం మేరకే పార్టీ నిర్ణయం ఉంటుంది" అని రేవంత్ స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్లను ఆ రెండు పార్టీలు అడ్డుకుంటున్నాయి: సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో కులగణన చేపట్టిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ సర్వే లెక్కల ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులతో కలిసి సీఎం మాట్లాడారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు రూపొందించి రాష్ట్రపతికి పంపాం. ఆ రిజర్వేషన్లపై పోరాడేందుకే దిల్లీకి వచ్చాం. జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహించి కేంద్రాన్ని నిలదీశాం. గల్లీలో కాదు.. దిల్లీలోనే తేల్చుకుందామని దేశ రాజధానికి వచ్చాం. ఈ ధర్నాకు 100 మంది ఎంపీలు మద్దతు ఇచ్చారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ రాకుండా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా అడ్డుకున్నారు. ఆ అపాయింట్‌మెంట్ కోసం మంత్రివర్గం మొత్తం ఎదురు చూస్తోంది. రాష్ట్రపతిని కలిసే అవకాశం మాకు ఇవ్వకపోవడం శోచనీయం. ముస్లిం రిజర్వేషన్ల సాకుతో ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు భాజపా చూస్తోంది. కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని భాజపా తో భారత రాష్ట్ర సమితి అంటకాగుతోంది. భాజపా తప్పిదాలను భారత రాష్ట్రసమితి నేతలు ఎందుకు ప్రశ్నించడం లేదు. మా ధర్నాలో ఆ పార్టీ రాజ్యసభ ఎంపీలు పాల్గొనలేదు సరికదా.. మమ్మల్ని అవహేళన చేస్తున్నారు. తాటిచెట్టంత పెరిగితే కాదు.. ఆవగింజంత అవగాహన కూడా ఉండాలి. బీసీ రిజర్వేషన్లను ఆ రెండు పార్టీలు అడ్డుకుంటున్నాయి. వారిని బీసీ ద్రోహులుగా తెలంగాణ సమాజం భావిస్తోంది. ఏ సమస్యను దీర్ఘకాలం వాయిదా వేసినా అది మిమ్మల్నే బలితీసుకుంటుంది. ఇప్పటికైనా ఈ బిల్లులకు ఆమోదం తెలపాలి. 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించాలని దిల్లీకి వచ్చాం. మూడు రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నాం. కేంద్రం నుంచి ఏమాత్రం సహకారం అందడం లేదు. భారత రాష్ట్ర సమితి బీసీలకు నైతిక మద్దతు కూడా ఇవ్వడం లేదు. ఆ రెండు పార్టీలకు క్షేత్రస్థాయిలో ప్రజలు గుణపాఠం చెప్పేలా కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణ ఉంటుంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు 3 మార్గాలు: సీఎం రేవంత్‌రెడ్డి

బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. "రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం సాయంత్రం వరకు వేచి చూస్తాం. రాష్ట్రపతి స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నాం. ఆమె సమయం ఇవ్వలేదంటే ప్రధాని ఒత్తిడి చేసినట్టు భావించాల్సి ఉంటుంది. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఉన్న మార్గాలన్నింటిని ప్రయత్నించాం. కుదరనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో స్థానిక ఎన్నికలకు వెళ్లాలి. బీసీ రిజర్వేషన్ల అమలుకు మా వద్ద 3 మార్గాలు ఉన్నాయి. 50శాతం సీలింగ్‌పై గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని పక్కన పెట్టి జీవో ఇవ్వాలి. జీవో ఇస్తే.. ఎవరైనా కోర్టుకు వెళ్తే స్టే వస్తుంది. కాబట్టి జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే మొదటి మార్గం సాధ్యం కాదు. ఇప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టకుండా ఆపడం రెండో మార్గం. స్థానిక ఎన్నికలు ఆపితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగుతాయి. కేంద్ర నిధులు రాకుంటే గ్రామాల్లో వ్యవస్థలు కుప్పకూలుతాయి. మూడో మార్గం పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వడం. బీసీలకు 42శాతం సీట్లపై ఇతర పార్టీలపైనా ఒత్తిడి తెస్తాం" అని సీఎం తెలిపారు.

# బ్రాహ్మణి కట్టిన చీర చూసి 90 మంది కొన్నారు..

మొదటి పేజి తరువాయి




ఇదే చేనేత కళకు ఉన్న ఆదరణ, దానికున్న శక్తికి నిదర్శనం" అని రాష్ట్ర ఐటీ, మానవ వనరులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు. కేవలం ఒక్క చీర ఇంతమందిని ఆకర్షించిందంటే, మంగళగిరి వస్త్రాలకు సరైన ప్రచారం కల్పిస్తే ప్రపంచ మార్కెట్‌ను శాసించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాడు మంగళగిరిలో ఏర్పాటు చేసిన వేడుకల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కళాకారుల నైపుణ్యానికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. తాను ఎవరినైనా కలిసినప్పుడు బహుమతిగా ఇవ్వాల్సి వస్తే, మంగళగిరి చేనేత వస్త్రాలనే అందిస్తానని, తద్వారా వాటి ఖ్యాతిని మరింత పెంచుతానని హామీ ఇచ్చారు.

నేతన్నలు నా కుటుంబ సభ్యులు..

"చేనేత కార్మికులు నాకు ఓటు వేసిన ప్రజలు మాత్రమే కాదు, నా కుటుంబ సభ్యులు. యువగళం పాదయాత్రలో వారి కష్టాలను కళ్లారా చూశాను. అందుకే వారికి ఇచ్చిన మాట ప్రకారం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి ఆదాయం 30 శాతం పెరిగేలా చర్యలు తీసుకున్నాం" అని లోకేశ్ గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే సొంత నిధులతో వారిని ఆదుకున్నానని, ఇప్పుడు ప్రభుత్వంలో ఉండి వారి బాగోగులు చూడటం తన బాధ్యత అని స్పష్టం చేశారు. వారు తన దృష్టిలో కార్మికులు కాదని, కళాకారులు అని అభివర్ణించారు.

ఇప్పుడు ట్రిపుల్ ఇంజన్ సర్కార్

ఇప్పుడు ట్రిపుల్ ఇంజన్ సర్కార్ పనిచేస్తోందని లోకేశ్ వ్యాఖ్యానించారు. "కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇక్కడి గల్లీలో మీ సేవకుడిగా నేను.. ముగ్గురం కలిసి మంగళగిరి రూపురేఖలు మారుస్తాం" అని భరోసా ఇచ్చారు. చేనేతలతో పాటు నియోజకవర్గంలోని స్వర్ణకారులను కూడా అన్ని విధాలా ఆదుకుంటామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చేనేత యోధుడు స్వర్గీయ ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయబోమని లోకేశ్ పునరుద్ఘాటించారు.

# రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ' కామెంట్స్‌లో ట్విస్ట్.. తప్పని తేలితే శిక్షే



మహారాష్ట్ర,కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయంటూ రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఓట్ చోర్ పేరుతో ఢిల్లీ ఇందిరా భవన్‌లో రాహుల్ గాంధీ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ ప్రజెంటేషన్‌లో అక్రమాలు జరిగిన ఓటర్ల జాబితాను బహిర్గతం చేశారు. అయితే రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ' ఆరోపణల్ని కర్ణాటక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ మీనా ఖండించారు. రాహుల్ వ్యాఖ్యలు నిరాధారమైనవి తెలిపింది. ఎన్నికల సంబంధించిన అంశాలను న్యాయం స్థానాన్ని ఆశ్రయించాలని సూచించింది. అదే సమయంలో రాహుల్ ఆరోపణలకు సంబంధించి అధికారిక డిక్లరేషన్, నకిలీ ఓటర్ల వివరాలను సమర్పించాలని కోరింది. తప్పుడు ఆధారాలు సమర్పిస్తే, 1950 ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం శిక్ష పడే అవకాశం ఉందని లేఖలో హెచ్చరించింది.

ఆ నియోజకవర్గంలో లక్ష నకిలీ ఓట్లు.. ఆధారాలివే

'సార్వత్రిక ఎన్నికల్లో బలమైన ప్రదర్శన ఇచ్చిన కొన్ని నెలలకే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి ఫలితాలు తారుమారువడంపై మాకు అనుమానం వచ్చింది. గతేడాది 48 మహారాష్ట్ర లోక్‌సభ స్థానాల్లో సీట్లలో 30 సీట్లు గెలుచుకున్న ఇండియా కూటమి.. కేవలం ఐదు నెలల తర్వాత జరిగిన రాష్ట్ర ఎన్నికల్లో 50 మార్కును ఎందుకు దాటలేకపోయింది. మహారాష్ట్ర,కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ కోసమే ఈసీ పనిచేసింది. అందుకు మా వద్ద అణుబాంబులాంటి ఆధారాలున్నాయి. మేం అంతర్గతం చేపట్టిన సర్వేలో కర్ణాటకలో ఇండియా కూటమి 16 ఎంపీ స్థానాలు గెలుస్తుందని తేలింది. కానీ తొమ్మిది స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఆ తర్వాత ఊహించని విధంగా ఓడిపోయిన ఏడు స్థానాలపై దృష్టి సారించాం. అలా బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ సెగ్మెంట్‌లోని అసెంబ్లీ స్థానమైన మహదేవపురలో ఓటమికి గల కారణాల్ని అన్వేషించాం. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభలో పోలైన మొత్తం ఓట్లు 6.26 లక్షలు. బీజేపీకి 6,58,915 ఓట్లు పోలవ్వగా.. 32,707 ఓట్ల తేడాతో గెలిచింది. ఇదే బెంగళూరు సెంట్రల్ లోక్‌సభలో మహదేవపుర అసెంబ్లీ స్థానాన్ని పరిశీలిస్తే.. ఓట్ల చోరీ జరిగినట్లు గుర్తించాం. మహదేవపురలో కాంగ్రెస్‌కు 1,15,586 ఓట్లు పోలవ్వగా.. బీజేపీ 2,29,632 ఓట్లు పోలయ్యాయి. బెంగళూరు సెంట్రల్‌లో సర్వజ్ఞనగర్,సీవీ రామ్ నగర్,శివాజీ నగర్,శాంతి నగర్,గాంధీ నగర్,రాజాజి నగర్,చామ్‌రాజ్‌పేట అన్నీ అసెంబ్లీ స్థానాల్లో గెలిచి ఒక్క మహదేవపురలో ఓడిపోయాం. ఈ మహదేవపుర అసెంబ్లీ నియోజక వర్గంలో ఐదు రకాలుగా 1,00,250 నకిలీ ఓట్లు గుర్తించాం. నకిలీ ఓటర్లు, నకిలీ, చెల్లని చిరునామాలు, ఒకే ఇంటి అడ్రస్‌తో పదుల సంఖ్యలో ఓటర్లు ఉన్నట్లు తేలింది. ఇది నిజమా? కాదా? అని నిర్ధారించేందుకు ఆ ఇంటి చిరునామాలకు వెళ్లాం. ఆ ఇంటి అడ్రస్‌లో ఉన్న ఓట్లను పరిశీలిస్తే.. అన్నీ నకిలీవేనని తేలింది' అని ఆరోపించారు.

# రప్పా.. రప్పా.. అంటే ఏపీ పోలీసులు రఫ్ఫాడిస్తారు మంత్రి నారా లోకేశ్

అమరావతి: తిరుపతిలో వైకాపా మాజీ ఎమ్మెల్యే, తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అనుచరులు రెచ్చిపోతుండటంపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ప్రజలు ఛీత్కరించినా వైకాపా నేతల బుద్ధిమారడం లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు డాక్టర్ సుధాకర్ దగ్గర నుంచి డ్రైవర్ సుబ్రహ్మణ్యం డెడ్‌బాడీ డోర్ డెలివరీ వరకు దళితులపై దమనకాండ జరిపిన ఆ నేతలు.. ఇప్పుడూ అదే పంథా కొనసాగిస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. తిరుపతిలో వైకాపా నేతలు ఓ యువకుడిపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి దాడులకు ఏపీలో చోటులేదన్నారు. రప్పా రప్పా అంటే ఏపీ పోలీసులు రఫ్ఫాడిస్తారని హెచ్చరిస్తూ 'ఎక్స్'లో యువకుడిపై వైకాపా నేతల విచక్షణా రహితంగా దాడి చేస్తున్న వీడియోను పోస్టు చేశారు.

తిరుపతిలో వైకాపా నేత భూమన అనుచరుల ఆగడాలు

బుధవారం రాత్రి తిరుపతిలోని శ్రీనివాసం వసతిగృహం ఎదురుగా ఉన్న దుకాణం కాంట్రాక్ట్‌ను తనకు రాసివ్వాలంటూ వైకాపా సోషల్ మీడియా ఇన్‌ఛార్జి అనిల్ రెడ్డి దౌర్జన్యానికి దిగారు. పవన్ అనే యువకుడిని కిడ్నాప్ చేసి ఎంఆర్‌పల్లిలోని తన ఇంట్లో బంధించి తీవ్రంగా హింసించారు. యువకుడిని చితకబాదుతుండగా అనిల్ రెడ్డి స్నేహితులు తీసిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరుల ఆగడాలపై హోం మంత్రి అనిత తీవ్రస్థాయిలో స్పందించారు. రౌడీ రాజకీయం చేస్తూ ఉంటే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, ఎంతటి వారైనా చట్టం ముందు సమానులేనన్నారు.

# ఈసీ చేతిలో ప్రజాస్వామ్యం ఖూనీ... మోదీ కోసమే!

ఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)పై కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఈసీ ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే సంస్థగా కాకుండా, దాన్ని ఓ క్రమపద్ధతిలో కూల్చివేయడానికి సహకరిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. బీజేపీతో ఈసీ కుమ్మక్కై ఎన్నికల ప్రక్రియను పూర్తిగా తారుమారు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా విశ్వసనీయతపై ఆయన తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. "అసలు ఓటర్ల జాబితా కచ్చితంగా ఉందా? సరైన వ్యక్తులు ఓటు వేయగలుగుతున్నారా? ప్రజల్లో తీవ్రమైన అనుమానాలు ఉన్నాయి, వాటికి బలమైన కారణాలు కూడా ఉన్నాయి" అని రాహుల్ అన్నారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల మధ్య కేవలం ఐదు నెలల వ్యవధిలో ఏకంగా కోటి మంది కొత్త ఓటర్లు ఎలా పెరిగారని ఆయన ప్రశ్నించారు. "లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మేము ఘన విజయం సాధించాం. కానీ కొన్ని నెలల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోయాం. ఈ మధ్యలో కోటి మంది కొత్త ఓటర్లు పుట్టుకొచ్చారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఈసీని కోరినా వారి నుంచి సమాధానం లేదు" అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, హర్యానా, మధ్యప్రదేశ్‌లలో ఒపీనియన్ పోల్స్‌కు, తమ అంతర్గత సర్వేలకు, వాస్తవ ఫలితాలకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని, ఫలితాలను ముందుగానే నిర్దేశించినట్లుగా ఉందని రాహుల్ ఆరోపించారు. మహారాష్ట్రలో పోలింగ్ కేంద్రాల వద్ద పెద్దగా క్యూలు లేనప్పటికీ, సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ శాతం అమాంతం పెరిగిపోవడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు. విశ్లేషణ కోసం ఓటర్ల జాబితా సాఫ్ట్ కాపీలను ఈసీ ఉద్దేశపూర్వకంగా నిరాకరిస్తోందని, సీసీటీవీ ఫుటేజ్‌ను ధ్వంసం చేస్తోందని రాహుల్ ఆరోపించారు. "ప్రధాని మోదీ కేవలం 25 సీట్ల మెజారిటీతో ఉన్న ప్రధాని. ఆయన అధికారంలో కొనసాగాలంటే 25 సీట్లను దొంగిలిస్తే సరిపోతుంది. అందుకే ఎన్నికల సంఘం నిజాలను కప్పిపుచ్చుతోంది" అని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# ట్రంప్ 50 శాతం సుంకాలు విధించారు... బీజేపీ నేతల ప్రగల్భాలు ఇప్పుడేమయ్యాయి?: ఒవైసీ

హైదరాబాద్: భారత్‌పై అమెరికా భారీ సుంకాలను విధించడంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా 50 శాతం సుంకం విధించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇది దౌత్యం కాదని, అమెరికా అధ్యక్షుడి దాదాగిరి అని గురువారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. "ట్రంప్ మనపై మరో 25 శాతం సుంకాన్ని విధించారు, దీంతో మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. అంతర్జాతీయ వాణిజ్యం ఎలా పనిచేస్తుందో తెలియని వ్యక్తి మనల్ని బెదిరిస్తున్నారు," అని ఆయన పేర్కొన్నారు. ఈ సుంకాల వల్ల భారత ఎగుమతిదారులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), తయారీదారులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అంతేకాకుండా, సరఫరా గొలుసులు దెబ్బతిని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గిపోయి, ఉద్యోగాలకు గట్టి దెబ్బ తగులుతుందని ఆయన హెచ్చరించారు. ఈ పరిణామాలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనాన్ని ఒవైసీ తీవ్రంగా ప్రశ్నించారు. "ఈ విషయాలు నరేంద్ర మోదీకి ఎందుకు పట్టడం లేదు? బీజేపీ నేతల ప్రగల్భాలు ఇప్పుడు ఏమయ్యాయి?" అని నిలదీశారు. గతంలో ట్రంప్ 56 శాతం సుంకాలు విధిస్తే మోదీ తన 56 అంగుళాల ఛాతీని చూపిస్తారా అని తాను ప్రశ్నించానని, బహుశా అందుకే ట్రంప్ 50 శాతంతో ఆగిపోయారేమోనని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని మీ మిత్రులైన బిలియనీర్ల ఖజానాలు నింపడం కోసం తాకట్టు పెట్టారా?" అని ఒవైసీ ప్రశ్నించారు. జూలై 31న కూడా ఇదే అంశంపై స్పందించిన ఒవైసీ, భారత్ ఒక స్వతంత్ర సార్వభౌమ దేశమని, అమెరికాకు సామంతు రాజ్యం కాదని అన్నారు. జపాన్‌పై 15 శాతం, వియత్నాంపై 20 శాతం, ఇండోనేషియాపై 19 శాతం సుంకాలు విధిస్తూ, భారత్‌పై మాత్రం కక్షపూరితంగా వ్యవహరించడం మన పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# బీసీ రిజర్వేషన్ల బాధ్యత నేనే తీసుకుంటా, కానీ..: కిషన్‌రెడ్డి

ఢిల్లీ: బీసీ రిజర్వేషన్లపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాట్ కామెంట్లు చేశారు. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు తీసేస్తే.. బీసీల రిజర్వేషన్ల బాధ్యత తానే తీసుకుంటానని అన్నారాయన. గురువారం ఉదయం ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ.. "రేవంత్ తన స్థాయికి మించి మాట్లాడుతున్నారు. ప్రధానమంత్రిని లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అంటారా? రేపు లంబాడాలను కన్వర్టెడ్ ఎస్టీ అంటారా?. అసలు ఆయనే కన్వర్టెడ్ కాంగ్రెస్. మజ్లిస్ కనుసన్నల్లో కాంగ్రెస్ పని చేస్తోంది. ఇదిలాగే కొనసాగితే ఒవైసీ కుటుంబానికే ముఖ్యమంత్రి పదవి ఇస్తారు. వచ్చేఎన్నికల్లో రేవంత్ ఓటమి ఖాయం.. .. గతంలోనే ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను తెలంగాణ హైకోర్ట్ కొట్టేసింది. మజ్లిస్ కనుసైగలతో కేసీఆర్ ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చారు. బీసీలకు 34 శాతం నుంచి 27 శాతం రిజర్వేషన్ తగ్గించారాయన. అలాంటప్పుడు ఇప్పుడెలా 10 శాతం రిజర్వేషన్లు ఇస్తారు. మత రిజర్వేషన్లతో దేశంలో అల్లకల్లోలం జరుగుతుంది.. అసలు ముస్లింలకు బీసీ రిజర్వేషన్లు ఎలా ఇస్తారు?. ముస్లింలకు పది శాతం రిజర్వేషన్లు తీసేస్తే.. బీసీల రిజర్వేషన్ బాధ్యత నేనే తీసుకుంటా. రాష్ట్రపతి, ప్రధానితో కూడా మాట్లాడతా అని కిషన్ రెడ్డి అన్నారు. బీసీలకు వెన్నుపోటు పొడవడంలో తెలంగాణ రోల్ మోడల్. బీసీలను మోసం చేయడంలో, అక్రమాలు చేయడంలో మేము నిరక్షరాస్యులం. కేసీఆర్ వల్ల జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీసీ సీట్లలో నాన్ బీసీలు మాత్రమే గెలిచారు. కాంగ్రెస్ తెచ్చిన బిల్లుతో బీసీలకు కేవలం 32 శాతం రిజర్వేషన్లు దక్కుతాయి. ఇది బీసీలను మోసం చేయడమే. రాజ్యాంగ సమస్యల వల్లే గవర్నర్ రాష్ట్రపతికి బీసీ బిల్లు పంపారు అని కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. "రాష్ట్రపతిపై తెలంగాణ మంత్రి వ్యాఖ్యలు సిగ్గు చేటు. దీనిపై సోనియాగాంధీ వెంటనే క్షమాపణలు చెప్పాలి" అని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారాయన.

## నాచారం దేవస్థాన పాలకమండలి సభ్యుల నియామకం

### సభ్యులుగా కూచారం సంతోష్, నాయకం శ్రీనివాస్



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) ఆగస్టు 7: తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం ఆధ్యాత్మికమైన పుణ్యక్షేత్రం శ్రీ నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి మెంబర్లుగా కూచారం సంతోష్, నాయకం శ్రీనివాస్ ను నియమితులయ్యారు. స్వామి వారి భక్తులకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు సేవ చేసుకునే అరుదైన అవకాశాన్ని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ప్రసాదించడం పూర్వజన్మ సుకృతమన్నారు. భక్తుల సౌకర్యార్థం తీసుకోవలసిన చర్యలు అభివృద్ధి కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు

### పాలస్తీనాపై ఇజ్రాయిల్ దౌర్జన్యం

## నిరసిస్తూ ఖమ్మంలో నిరసన ర్యాలీ

### ర్యాలీలో పాల్గొన్న వివిధ ప్రజా సంఘాల పార్టీ నాయకులు



కొన్నిజర్ల ఆగస్టు 8 రిపోర్టర్ నవీన్ (శుభోదయం న్యూస్): యుద్ధాలు దేశాల మధ్య కావచ్చు, పసిపాపలు ఏం చేశారని ఆస్పత్రులు పై బాంబులు పాఠశాల పై దాడులు అన్ని యుద్ధ నేరాలే వీటిని అడ్డుకోవాల్సింది మన నిరసన స్వరాలే అని అంబేద్కర్ విద్యార్థి యువజన సమైక్య సంఘం అధ్యక్షులు కోలా నవీన్ కుమార్ అన్నారు ఈరోజు ఖమ్మం పట్టణంలో వేలాది మందితో పాలస్తీనా పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను నిరసిస్తూ నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పాలస్తీనా ఇజ్రాయిల్ ఘర్షనులకు కారణాలు ఏమైనా ఉండొచ్చని చిన్నారులు, మహిళలు ఏం పాపం ఆయన ఖండించారు గాజా స్ట్రీట్ ఇజ్రాయిల్ దాడులు మానవ హక్కుల ఉల్లంగన అక్షరాల అన్యాయం అన్నారు ఈ దౌర్జన్యం వల్ల గాజాలో నీరు,విద్యుత్,ఆహారం, ఔషధాల కొరత తీవ్రమైందని ఆరోపించారు ఈ ఘటనల వల్ల ఆసుపత్రి,పాఠశాలలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని ఎంతోమంది పౌరులు చనిపోయారని ఇంకా పసిపిల్లలు ఆకలితో అనుమతిస్తూ చనిపోతున్నారని అన్నారు 2005లో ఇజ్రాయిల్ గాజుకు స్వేచ్ఛ ఇచ్చినట్టు ఇచ్చి, భూమి సముద్రం, గగనతనంపై లెక్కలేనని ఆంక్షలు విధించిందని అన్నారు. బాంబు రాకెట్ దాడులు మరింత సంక్షేపాన్ని సృష్టిస్తున్నాయని ఈ దాడులు వల్ల గాజులు 20 లక్షల మంది ప్రజలు జీవనాన్ని దుర్భరం చేస్తున్నారన్నారు అనంతరం పాలస్తీనా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారి యొక్క విధి విధానాలను చిన్నపిల్లలతో వేసిన వేషధారణ కళ్ళకు కట్టినట్లు ఉంది. ఈ కార్యక్రమంలో సల్మాన్ సురేష్ రంజిత్ పృధ్వి రామకృష్ణ కిరణ్ ఉపేందర్ మహేష్ మరియు వివిధ పార్టీల ప్రజా సంఘాల నాయకులు విద్యార్థులు మేధావులు పాల్గొన్నారు.

## కవి పారుపల్లి నరసింహను సన్మానించిన కలెక్టర్



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని జౌళి శాఖ ఏడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలోజిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు పాల్గొని చేనేత రంగంలో విశేష కృషి చేసిన నేతన్నలకు సన్మానం చేసి మెమొంటో అందజేశారు.వలిగొండ మండల కేంద్రానికి చెందిన నేషనల్ పద్మ అవార్డు,మహాకవి నన్నయ్య నేషనల్ అవార్డు గ్రహీత కవి పారుపల్లి నరసింహ ను జిల్లా కలెక్టర్ మెమొంటో శాలువాతో సత్కరించారు.

## అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేష్టమైనవి




వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠమైనవని డాక్టర్ తేజస్విని అన్నారు.గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ ప్రసవించిన తర్వాత గంటలోపు తల్లి పాలను మురుపాలు అంటారనీ మురుపాలలో కొలెస్ట్రాల్ ఉంటుందన ఆ పాలను త్రాగించడం వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆ పాలు బిడ్డకు మొదటి టీకాతో సమానం అని అన్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్స్, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్స్,తల్లులు గర్భవతులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కోటా వెంకటాపూర్ గ్రామస్తులు



(శుభోదయం న్యూస్): పరకాల కాన్స్టిట్యూషన్ సంగం మండల్ కోట వెంకటాపూర్ గ్రామంలో పది రోజుల క్రితం బండ కింది క్రాంతి కుమార్ కొన్ని రోజుల క్రితం నుండి కిడ్నీ సమస్యతో బాధపడుతూ హాస్పిటల్లో చికిత్స పొందుతూ చనిపోవడం జరిగింది వారికి ఇద్దరు చిన్నపిల్లలు ఉండగా వాళ్ళ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న గ్రామస్తులు తమ వంతు సహాయంగా 31,000 రూపాయలు అందించడం జరిగింది వెంకటాపురం గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపిన మీ న్యాల అశోక్ యాదవ్.

## శ్రద్ధాంజలి. బందెల దామోదర్ కు



పరకాల నియోజకవర్గం (శుభోదయం న్యూస్):కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నడికూడ మండలం ముస్తాలపల్లీ గ్రామ పార్టీ అధ్యక్షులు బందెల దామోదర్ స్వర్గస్థులైనారు వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, నడికూడ మండల సమన్వయ కమిటీ సభ్యులు మల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రంజన్ అలీ, గ్రామ కాంగ్రెస్ నాయకులు రవి, అనిల్, బోట్ల రమాకాంత్, స్వామి, బోట్ల ఆనందం తదితరులు పాల్గొన్నారు.

### మెయిన్ రోడ్డుపై నిలిచిపోయిన

## మోరీల మరమత్తులను వెంటనే చేపట్టాలి



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):వలిగొండ పట్టణంలో పాత పోస్ట్ ఆఫీస్ వద్ద నిలిచిపోయిన ఆర్ఎంబి రోడ్డుపై గల మోరీ మరమ్మతులను వెంటనే చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్,పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహలు డిమాండ్ చేశారు.గురువారం సిపిఎం వలిగొండ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వలిగొండ మెయిన్ రోడ్డుపై పాత పోస్ట్ ఆఫీస్ వద్ద సగం తొవ్వి నిలిపివేసిన మోరి మరమత్తు పనులనుపరిశీలించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ నరసింహలు మాట్లాడుతూ ఆర్ఎంబి అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన మోరీ పనులనువెంటనే చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.వలిగొండ పట్టణంలో శివ సాయి ఫంక్షన్ హాల్ కి వెళ్లే మార్గంలో ఒకటి,పాత పోస్ట్ ఆఫీస్ వద్ద మరో మోరీలను తవ్వి నెలలు గడుస్తున్న అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు పూర్తి కావడంలేదని దీంతో అనేకమంది ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారుల నిర్లక్ష్యం వీడి మోరీ పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. మండలంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంలో మండల స్థాయిలో ఉన్న అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు,వెంటనే పట్టణంలో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు కొండూరు సత్తయ్య,వేముల లక్ష్మయ్య,ఆలకుంట్ల నరసింహ,ధ్యాన బోయిన యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా అభివృద్ధి దిశగా మరో అడుగు

### అంతర్గాం మండలంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి వినతి పత్రం

### రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ మరియు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణరావు



రామగుండం మండలం, రిపోర్టర్ -(శుభోదయం న్యూస్): పెద్దపల్లి జిల్లా, అంతర్గాం మండలంలో విమానాశ్రయం నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేయాలని కోరుతూ, రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ మరియు పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు విజయ రమణ రావు కలిసి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి ని న్యూఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు పెద్దపల్లి జిల్లా భౌగోళికం, పరిశ్రమలు, జనాభా వృద్ధి, రవాణా అవసరాలు తదితర అంశాలను మంత్రి కి వివరించి, విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లాలో వాణిజ్య, పారిశ్రామిక మరియు పర్యాటక అభివృద్ధికి అనుకూల వాతావరణం ఏర్పడుతుందని వివరించారు. కేంద్ర మంత్రి ఈ అంశాన్ని సానుకూలంగా పరిగణించారని, అవసరమైన సాంకేతిక పరిశీలనల అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ చర్యలతో పెద్దపల్లి జిల్లా అభివృద్ధికి మరింత ఊపునిచ్చే అవకాశం ఉందని శాసనసభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## 10వ జాతీయ ఓబీసీ మహాసభలో జిల్లా నాయకులు

### నీల నాగరాజు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు




తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్), ఆగస్టు 7: ఈ సందర్భంగా నీల నాగరాజు మాట్లాడుతూ గోవా రాష్ట్రంలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభకు జిల్లా నుండి పెద్ద ఎత్తున బీసీ నాయకులు హాజరవడం జరిగిందన్నారు.దేశంలో మొదటిజ్ సారి మండల కమీషన్ సిఫార్సులైన ఓబీసీలకు ఉద్యోగ రంగంలో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ సింగ్ ప్రకటించిన ఆగస్ట్ 7 రోజున ప్రతీ సంవత్సరం దేశంలోని అన్ని ఉద్యమ శక్తులు ఈ మహాసభను పెద్ద ఎత్తున జరుపుకోవడం జరిగిందని అన్నారు.అలాగే బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వంచే చట్టపరంగా అమలు చేసే వరకు ఉద్యమించి సాధించుకుంటామని తెలిపారు.చట్టసభల్లో బీసీ మహిళలకు ప్రత్యేక కోట ద్వారా బేషరతుగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్,బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్,జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ హన్స్రాజ్ గంగారామ్,మానిక్ రావ్ ఠాక్రే,కేంద్ర,రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. కార్యదర్శి నాగరాజ్ గౌడ్,ఉపాధ్యక్షులు అజయ్,గోవర్ధన్,శ్యామ్, దయాకర్,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణాలోని యూనివర్శిటీల్లో

## సమస్యలు పరిష్కరించాలి : పి.డి.ఎస్.యు



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): హైదరాబాద్ లోని ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ ఇటుకల పురుషోత్తం గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు బోల్లురి కిరణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ లోని యూనివర్సిటీ లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రొపెసర్, అసిస్టెంట్ ప్రొపెసర్, అసోసియేటివ్, టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అదేవిధంగా విద్యార్థులకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలని, కాంట్రాక్ట్ పోస్టులను తక్షణమే రెగ్యులర్ చేయాలని,పిహెచ్ డి విద్యార్థులకు ఫెలోషిప్స్ పెంచాలని,రీసర్చ్ కు అవసరం అయ్యే అన్ని వసతులను కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో పి.డి.ఎస్.యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్. బాల్ రాజ్, నాయకులు సిహెచ్ సాయిలు లు పాల్గొన్నారు.

## గుబ్బ కోల్డ్ స్టోరేజ్ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం



గుమ్మడిదల, (శుభోదయం న్యూస్): గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని అన్నారం గ్రామంలో గుబ్బ కోల్డ్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. పరిశ్రమలో నుండి మంటలు చెలరేగి తక్కువ సమయం లోనే భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. మంటల కారణంగా దట్టమైన పొగలు చుట్టుపక్కల ప్రాంతాలను కమ్ముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని 10 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. ప్రాణ నష్టం జరగకపోగా, భారీగా ఆస్తి నష్టం జరిగిందని పరిశ్రమ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. గుబ్బ కోల్డ్ పరిశ్రమలో భారీగా పేలుడు పెద్దలకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల ఇలాంటి పరిశ్రమలు ఉండటం వల్ల ప్రజల ప్రాణాల ను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ బ్రతకాల్సి వస్తుందని అన్నారు. ఈ పరిశ్రమల వల్ల ఎ క్షణాన ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్ టి పి సి కృష్ణ నగర్ లో తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కార్యక్రమం

### రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో



రామగుండం మండలం, రిపోర్టర్- (శుభోదయం న్యూస్) వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ టి పి సి కృష్ణా నగర్ లో ఇంటింటా తిరుగుతూ తడి చెత్త పొడి పొడి చెత్త వేరు చేయడం పై అవగాహన కల్పించారు . ఫైవ్ ఇంక్లైన్ వద్ద నాలా లో పూడిక తొలగించారు . కొత్త భవనాలకు ఆస్తి పన్ను మధింపు చేశారు . ఈ కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఆర్ ఓ ఆంజనేయులు , ఆర్ ఐ శంకర్ రావు , సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ , నాగ భూషణం, మెప్మా , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వాడల్లో వరుస అగ్ని ప్రమాదాలు.....



శుభోదయం న్యూస్: పారిశ్రామిక వాడల్లో వరుస అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో స్థానికులతో పాటు కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పరిశ్రమల్లో జరిగిన ఘటన మరువకముందే ఇప్పటివరకు మరో రెండు పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరగడం చూస్తుంటే అధికారులు, పరిశ్రమల యాజమాన్యం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. గుమ్మడిదల పారిశ్రామిక వాడల్లో అనేక పరిశ్రమలు ఉన్నాయి. కానీ అగ్నిమాపక కేంద్రాలు లేకపోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎనగండ్ల నరేందర్ అన్నారు. ఎన్నోసార్లు ఉన్నత అధికారులకు పలుమార్లు చెప్పిన అధికారులు స్పందించడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

## చనిపోయిన కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన పరకాల అధికార ప్రతినిధి చాలా రెడ్డి



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్) గీసుగొండ గ్రామానికి చెందిన చిన్నగారి భాస్కర్ ఆరు రోజుల క్రితం సూసైడ్ చేసుకొని చనిపోవడం జరిగింది కావున వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని వారిని ఓదార్చి ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పి 5వేల రూపాయలు ఆర్థిక సాయం చేసిన పరకాల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిది చాడ కొమురారెడ్డితో ఉన్నవారు దౌడు ప్రవీణ్ కుమార్. గీసుగొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు. దౌడు భరత్ మాజీ ఎంపిటిసి కోమల. మాధవరెడ్డి. యూత్ అధ్యక్షుడు ఇనుముల అభిలాష్. దౌడు చంద్రు కోట చంటి. దౌడు దామోదర్ చిన్న. జేమ్స్ చిన్నగారి కుమార్. సదానందం. కొంతమంది కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా కుంభం కీర్తిరెడ్డి జన్మదిన వేడుకలు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలో స్థానిక ప్రభుత్వ దావఖానాలో పట్టణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రేడ్లు పంపిణి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బత్తిని వరుణ్ గౌడ్, పట్టణ అధ్యక్షులు పూసుకూరి లింగస్వామి,మైనారిటీ మండల అధ్యక్షులు సయ్యద్ బాబా, మండల ఉపాధ్యక్షులు మనోజ్,ఎన్ ఎస్ యు ఐ మండల్ అధ్యక్షులు సాయి,చిన్నపాక నరేందర్,మైసోళ్ళ వినోద్,నవీన్,రేగు మల్లికార్జున్,ఎక్కల దేవి శ్రీను,వినేష్, వెంకటేష్,వినయ్,శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో వన మహోత్సవం



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మొత్తంలో వన మహోత్సవం కార్యక్రమం చేయాలని ఎంపీడీవోలకుఅందరికీ ఆదేశాలు ఇవ్వటం జరిగింది.వలిగొండ మండలంలోనీ అన్ని గ్రామ పంచాయతీ లలో వనమహోత్సవం కార్యక్రమం చేపట్టటం జరిగింది.ఈసందర్భంగా మండల పరిధిలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లో విద్యార్థిని విద్యార్థులు వనమహోత్సవ కార్యక్రమాన్ని కాలేజి ఆవరణలో చేపట్టటం జరిగింది.ఎంపీడీవో, ప్రిన్సిపాల్,స్టాఫ్,గ్రామ పంచాయతీ సెక్రెటరీ,సిబ్బంది, ఈజీఎస్,ఏ పీ ఓ, విద్యార్థులతో వానమహోత్సవలో పాల్గొని,ఈకార్యక్రమాన్ని విజయవంతం,చేయడం జరిగింది.మండల ప్రజలందరూ ప్రతి ఒక్కరు ఒక చెట్టు నాటాలని తద్వారా పర్యవరాన్ని కాపాడుకోవాలని కోరడం జరిగింది.

## పదేళ్లలో లేని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంలో సాధిస్తాం

### లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 7: మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతనంగా రేషన్ కార్డు లబ్దిరులకు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో ప్రభుత్వం చేసిన పనులు ఎక్కడ కూడా కనిపించడం లేదని,ఇప్పటికీ కాంగ్రెస్ హయాంలో పల్లెల్లో గ్రామాల్లో చేసిన పాత పథకాలే పల్లెల్లో కనిపిస్తున్నాయన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసమే అనేక సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు.అందులోనే ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ చేసిన పథకాలే దర్శనమిస్తున్నాయన్నారు.ఇప్పటికీ అప్పటి నుండి కట్టిన ఇందిరమ్మ ఇండ్లు ప్రతి పల్లె గ్రామాల్లో ఉన్నాయన్నారు.డబుల్ బెడ్ రూమ్ వాళ్ళ లబ్ధిదారులకు లభించిన దానికంటే ఇందిరమ్మ ఇండ్ల ద్వారా ఎంతో ప్రయోజనం ఉందన్నారు.రాష్ట్రం మొత్తంలో పేద ప్రజలకు సన్నబియ్యం ఎంతో ప్రతిష్టాత్మకం అయిందన్నారు.ఎంతో ప్రయాసంతో సన్న బియ్యం సరఫరా జరుగుతుందన్నారు.అలాగే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఎంతో లాభం ఉందన్నారు.రాష్ట్రంలో 10 సంవత్సరాల నుండి ఇవ్వని రేషన్ కార్డులను ప్రభుత్వం పంపించడం ద్వారా లక్షల కుటుంబాలకు ఆసరా ఇస్తుందన్నారు.గత పది సంవత్సరాల్లో జరగని అభివృద్ధి 20 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా చేసి సాధిస్తామన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా 9665 రేషన్ కార్డులు మంజూరయ్యాయని అన్నారు.అదేవిధంగా రామాయంపేట మండలంలో 1090 కొత్త రేషన్ కార్డులు మంజూరు కాగా అందులో 2123 పేర్ల నమోదు చేర్పులు మార్పులు చేసి వారికి అందజేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నాగేష్ ఆర్డిఓ రమాదేవి మండల తహసిల్దార్ రజనీకుమారి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాత్రావు బ్లాక్ కాంగ్రెస్ నాయకులు ఏసుగారి రమేష్ రెడ్డి రామాయంపేట ఆర్ఐ గౌస్ మొయినోద్దీన్ రూరల్ ఆర్ఐ గోపి వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు

## ఇసుక దొరకక డస్టుతో నిర్మాణం

### మెదక్ తుప్రాన్ ప్రాంతాల్లో ఇసుక డంపులు ఏర్పాటు చేయాలి



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 7:- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రమంతటా ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు సొంత స్థలాలలో కట్టుకునే వారికి 5 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతున్నది.గతంలో కూడా కాంగ్రెస్ హయంలో 5 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగింది.అప్పటికి ఇప్పటికీ ఇంటి నిర్మాణ సామాగ్రి విపరీతంగా పెరిగిపోవడం కనీసం ఒక ఇంటి నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుందని లబ్ధిదారులు అంటున్నారు.అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వపరంగా ఇళ్ల నిర్మాణానికి కనీసంగా పకృతి పరంగా లభించే ఇసుకతో పాటు కంకర మొదలైన వాటిపై సబ్సిడీ వస్తే ఏదో విధంగా ఇండ్ల నిర్మాణం చేసుకుంటామని అంటున్నారు.రామాయంపేట మండల పరిధిలో మున్సిపాలిటీ ఏరియాలో లబ్ధిదారులకు చాలా ఇబ్బందులకు గురవుతున్నామని అంటున్నారు.పట్టణ పరిధి అనేక అభివృద్ధి నిర్మాణాలు సొంతంగా పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్న తరుణంలో ఇంటి సామాగ్రికి పోటీ తత్వం ఏర్పడడం అందువల్ల లబ్ధిదారులకు అనుకున్నంత నిధులు లేకపోవడం ఇబ్బందికరంగా ఏర్పడిందటున్నారు.కొందరు పునాదులను డస్టుతో నిర్మించుకొంటున్నారని



అంటున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో మండల పరిధిలో లబ్ధిదారులకు కొద్ది గొప్పగా సౌకర్యం కలగడానికి ఇసుక డంపులను మెదక్ తుప్రాన్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని అధికారులు తెలపడం దానిపై రవాణాచార్జీలతో ఇసుక తెచ్చుకుంటామని తమ ఇళ్లకు సౌకర్యంగా ఉంటుందని లబ్ధిదారులు అంటున్నారు.ఈ విషయమై తహసిల్దార్ పై అధికారులతో వెంటనే మాట్లాడి లబ్ధిదారులకు ఉచిత ఇసుక పంపిణి పై తగు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు అధికారులను వేడుకుంటున్నారు.

# ఫ్యాన్ గుర్తుకే మన ఓటు అంటూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్సీ



బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం రిపోర్టర్ నాగేంద్ర (శుభోదయం న్యూస్): ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అపూర్వమైన ప్రజాదరణ ప్రజల ఆశీర్వాదంతో విజయం వైపు అడుగులు వేస్తున్న ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి గారికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న బద్వేలు నియోజకవర్గం ఇంచార్జ్ మరియు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ , ఎమ్మెల్సీ గారి కుమారుడు బద్వేలు నియోజకవర్గం యువ నాయకులు మరియు రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి ఒంటిమిట్ట మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు పుంజుకుంటుంది ఈనెల 12న జరగనున్న జడ్పిటిసి ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి గారిని అనూహ్య మైన ప్రజాబలం లభిస్తోంది మండలంలోని ప్రతి గ్రామంలోనూ జనాల మద్దతు ఊపందుకుంటూ, ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన అవుతోంది గత వైయస్సార్ కాంగ్రెస్ పాలనలో అమలైన



సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయి ముఖ్యంగా ఇంటింటికి పథకాలు చేరాలా తీసుకొని వచ్చిన పాలనను అభివృద్ధిని ప్రజల సంతోషంతో గుర్తు చేసుకుంటున్నారు అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు ఇచ్చిన హామీలను పూర్తి నిబద్ధతతో అమలు చేయడాన్ని జనం అభినందిస్తున్నారు ఈ అభిప్రాయంతో ఒంటిమిట్ట ప్రజలు వైయస్సార్ సిపి కి మద్దతుగా నిలుస్తున్నారు అభ్యర్థి ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి గారిని గెలిపించాలని గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రజలు సంకల్పంతో ముందుకు వస్తున్నారు ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ రాష్ట్రస్థాయి నాయకులు జిల్లాస్థాయి నాయకులు జిల్లా అనుబంధ విభాగాల నాయకులు జెడ్పిటిసిలు ఎంపీపీలు మండల కన్వీనర్లు సర్పంచులు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాయచోటి నుండి బద్వేల్ నియోజకవర్గానికి బదిలీపై వచ్చిన పారామెడికల్ అధికారి



బద్వేల్ నియోజకవర్గం ప్రతినిధి - శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): బద్వేల్ నియోజకవర్గానికి బదిలీపై వచ్చిన వచ్చిన డిప్యూటీ పారామెడికల్ అధికారి బలపనూరు శంభూ ప్రసాద్ అన్నమయ్య జిల్లా రాయచోటి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి బదిలీపై బద్వేలు రూరల్ ప్రాథమిక ఆరోగ్య



కేంద్రము తొట్టిగారిపల్లె కు వచ్చారు. ఈయన ఇదే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంలో పనిచేశారు. ప్రమోషన్ మీద కడపకు తర్వాత రాయచోటికి బదిలీపై వెళ్లడం జరిగింది. వీరు ప్రధానంగా కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో వ్యాధి లక్షణాలు అవగాహన కల్పించడం, చికిత్స ఇప్పించడం, వ్యాధికి సంబంధించిన కార్యకలాపాలు పర్యవేక్షించడం జరుగుతుంది. వీరు బద్వేలు డివిజన్లోని ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పర్యవేక్షిస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలను ప్రారంభం లోనే గుర్తించి చికిత్స ఇప్పించడం వల్ల అంగవైకల్యం రాకుండా చేయవచ్చునని తెలిపారు. అందువల్ల క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు వ్యాధి లక్షణాలను త్వరితగతిన గుర్తించి వైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లి చికిత్స ఇప్పించాలని కోరారు.

# చింతలపూడి నుండి గురుపట్ల గూడెం ఆర్ అండ్ బి రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రోషన్ కుమార్



ఏలూరు జిల్లా ప్రతినిధి - ప్రసాద్ (శుభోదయం న్యూస్) : త్వరలో చింతలపూడి రోడ్లకు మహార్ధశ- శాసన సభ్యుల వారి నిరంతర కృషితో చింతలపూడి నియోజకవర్గ ప్రజల కళ్ళల్లో ఆనందం చింతలపూడి పట్టణంలో చింతలపూడి - గురుబట్ల గూడెం రోడ్డు పనులకు భూమి పూజ చేసిన చింతలపూడి శాసనసభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్. కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని అదేవిధంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆ విధంగానే చింతలపూడి నియోజకవర్గంలో రహదారులు ప్రక్రియ చేపట్టామని అదేవిధంగా నాణ్యతతో కూడిన రహదారులు నిర్మిస్తామని ఎమ్మెల్యే రోషన్ తెలియపరిచారు ఈ కార్యక్రమంలో చింతలపూడి పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు,అధికారులు,అభిమానులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా సాగుతున్న ఆడమిల్లి డైవర్షన్ పనులు



ఏలూరు జిల్లా ప్రతినిధి - ప్రసాద్(శుభోదయం న్యూస్): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఏలూరు- జంగారెడ్డిగూడెం మధ్య అడమిల్లి వద్ద కూలిపోయిన వంతెన డైవర్షన్ పనులు చింతలపూడి ఎమ్మెల్యే శ్రీ సొంగా రోషన్ కుమార్ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించడంతో వేగం పుంజుకున్నాయి. ఇప్పటికే విద్యుత్ శాఖ డైవర్షన్ పనులకు అడ్డుగా ఉన్న 16 విద్యుత్ స్తంభాలను తొలగించారు. దాంతో ఆర్ అండ్ బి శాఖ రోడ్డు డైవర్షన్ పనులను వేగవంతం చేశారు. సోమవారం నాటికీ వంతెన డైవర్షన్ పనులు పూర్తి చేసి వినియోగంలోనికి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు.

# వైద్య సేవలలో జవాబుదారీతనం పెంచేలా చర్యలు తీసుకోవాలి

**ప్రభుత్వ సేవలలో ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలి**

**వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్**



ఏలూరు, జిల్లా ప్రతినిధి- ప్రసాద్ (శుభోదయం న్యూస్) : జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలలో జవాబుదారీతనం పెంచి, ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరించారు. కలెక్టరేట్ నుండి బుధవారం ప్రభుత్వ సేవలలో ప్రజల సంతృప్తి స్థాయి అంశపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి స్థాయి, అవినీతి, నిర్లక్ష్యం, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను సేకరిస్తున్నదన్నారు. అధికారులు, సిబ్బంది అందరూ ప్రజలతో మర్యాపూర్వకంగా మాట్లాడడంతోపాటు, వారికి మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతోపాటు, ప్రజలకు మంచి సేవలందిస్తూ, ప్రజల మన్ననలు పొందిన వారిని అభినందిస్తామన్నారు. బొర్రంపాలెం, కొల్లేటికోట, జీలుగుమిల్లి పీహెచ్సి లలో వైద్యసేవలలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఐవిఆర్ఎస్ సర్వే లో వచ్చిందన్నారు. ఐవిఆర్ఎస్ సర్వే లో వెనుకబడిన అధికారులు, సిబ్బంది తమ పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. మండవల్లి, పట్టిసీమ, తాడువాయి, ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ వైద్య కేంద్రాలలో సిబ్బంది మెరుగైన వైద్య సేవలందిస్తున్నారని ఐవిఆర్ఎస్ సర్వే వచ్చిందని వారిని కలెక్టర్ అభినందించారు. జిల్లాలో పెన్షన్ పంపిణీలో ప్రజల సంతృప్తి స్థాయిపై డిఆర్డిఏ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించి, సేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పరిసరాలు, క్యూ లైన్లలో పారిశుద్ధ్యం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# కరుడుగట్టిన అంతర జిల్లా దొంగలను అరెస్ట్ చేసిన కడప జిల్లా పోలీసులు

బద్వేల్ నియోజకవర్గం ప్రతినిధి రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసిన కడప పోలీసులు సుమారు 60 లక్షలు విలువ చేయు చోరి కాబడిన అర్ధ కేజీ బంగారు, 10 కేజీల వెండి ఆభరణాల చోరి సొత్తు మరియు చోరి కాబడిన ఒక బైక్ స్వాదినం. ఒక నాటు తుపాకి, ఒక బొలెరో పికప్ వాహనం మరియు ఎర్ర చందనం దుంగలు స్వాధీనం... కడప జిల్లాలో జరిగిన పలు చోరీ కేసులు ఛేదింపు. గురువారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శ్రీ ఇ.జి. అశోక్ కుమార్ అరెస్టయిన దొంగల వివరాలు : 1) గుమ్మళ్ళ వెంకటసుబ్బయ్య, వయసు 37 సం., తండ్రి పేరు సుబ్బరాయుడు, అట్లూరు మండలం చలంారి పల్లి గ్రామం, ప్రస్తుతం చెన్నంపల్లి మిట్ట, బద్వేల్ టౌన్, వైఎస్సార్ కడప జిల్లా. 2) నూతి వెంకటసుబ్బయ్య, వయసు 30 సంవత్సరములు, తండ్రి పిచ్చయ్య, గౌరీ శంకర్ నగర్, బద్వేల్ టౌన్, వైఎస్సార్ కడప జిల్లా.స్వాధీనం చేసుకున్నవి : సుమారు రూ. 60 లక్షల విలువ చేసే అర్థ కేజీ బంగారు మరియు 10 కేజీల వెండి ఆభరణాలు, ఒక నాటు తుపాకి, ఒక బైక్, ఒక బొలెరో వాహనం మరియు ఎర్ర చందనం దుంగలు. సీరియస్ గా తీసుకున్న జిల్లా ఎస్పీ ... రంగంలోకి ప్రత్యేక పోలీసు బృందాలు గత రెండు సంవత్సరాల నుండి గుర్తు తెలియని దొంగలు, కడప జిల్లాలోని పోరుమామిళ్ల, బి.కోడూర్, మైదుకూర్, బద్వేల్ టౌన్, కలసపాడు, ఖాజీపేట, కాశినాయన, దువ్వూరు పోలీస్ స్టేషన్ ల పరిధిలో తాళం వేసిన ఇళ్లపై పగలు రెక్కీ చేసి, రాత్రి సమయాలలో తాళాలు పగులగొట్టి ఆ ఇండ్లలోకి చొరబడి, ఆ ఇళ్లల్లో ఉన్న విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు దోచుకెల్లడం జరిగింది. ఈ విధంగా 12 ఇండ్లు, ఒక బంగారు షాప్ నందు జరిగిన చోరీలను జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ సిరియస్ గా తీసుకున్నారు. ఈ చోరీలు చేదించడానికి మైదుకూర్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ గారి ఆధ్వర్యంలో బద్వేల్ రూరల్ సి.ఐ . నాగభూషన్, మైదుకూరు ఇన్స్పెక్టర్ అయిన శ్రీ రమణారెడ్డి, బద్వేల్ రూరల్ యస్.ఐ. కే. శ్రీకాంత్ మరియు సిబ్బందితోటి ప్రతేక టీం ను ఏర్పాటు చేయడం జరిగినది. పోలీస్ ల నిఘా పెరగడంతో దొంగలు రూట్ మార్చి, గతములో వారికి అలవాటు ఉన్న ఎర్రచందనం స్మగ్లింగ్ చేయడం ప్రారంబించినారు. ఈ క్రమంలో పై ఇరువురు వ్యక్తులు గోపవరం మండలం పీపీ కుంట సమీపంలోని చేలిమికుంట అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను నరికి వాటిని కర్ణాటక ప్రాంతములోని కటికనహళ్లికి అక్రమ రవాణా చేస్తున్నారనే ఖచ్చితమైన సమాచారం మీద బద్వేల్ రూరల్ సి.ఐ. ఎం. నాగభూషణ్, ఆధ్వర్యంలోని ప్రత్యేక టీం పైన తెల్పిన ముద్దాయిలు ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఎర్ర చందనం రవాణా చేయుటకు ఉపయోగించిన ఒక బొలెరో వాహనం, 4 ఎర్ర చందనం దుంగలు, మరియు ఒక నాటు తుపాకి స్వాధీనం చేసుకోవడమైనది. పోలీస్ విచారణలో గత నేరచరిత్ర



కలిగిన పై ఇరువురు వ్యక్తులను గట్టిగా విచారించగా వారు అనేక ఇండ్లలో చోరీలు చేసినట్లు బయటపడినది. వాటి వివరాలు 2023 జులై మరియు సెప్టెంబర్ నెలల్లో పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ పరిదిలోని రెండు చోరీలు: (1) టేకూర్ గ్రామములో ఒక ఇల్లు. (2) పోరుమామిళ్ల టౌన్ లో సుందరయ్య కాలనీ లో ఒక ఇల్లు. 2024 సంవత్సరములో ఫిబ్రవరి, జులై మరియు ఆగష్టు నెలల్లో మైదుకూరు పోలీస్ స్టేషన్ పరిదిలోని మూడు చోరీలు: (1) జీవీ సత్రంలోని ఒక బంగారు షాప్ (2) ఎల్లంపల్లి గ్రామము ఒక ఇల్లు. (3) మైదుకూరు టౌన్ లోని పాతపాలెంలోని ఒక ఇల్లు. 2024 సంవత్సరములో ఫిబ్రవరి నెలలో బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ పరిదిలోని రెండు చోరీలు: (1) బద్వేల్ టౌన్ లోని శివాలయం వీదిలో ఒక ఇల్లు (2) బద్వేల్ టౌన్ లోని తెలుగుగంగ కాలనీ లో ఒక ఇల్లు. 2024 సంవత్సరములో మార్చి మరియు జూలై నెలలో కలసపాడు పోలీస్ స్టేషన్ పరిదిలోని రెండు చోరీలు: (1) కలసపాడు టౌన్ లో డైరీ పక్కన ఒక ఇల్లు (2) లింగారెడ్డిపల్లి గ్రామములోఒక ఇల్లు. 2023 సంవత్సరములో అక్టోబర్ నెలలో బి. కోడూరు పోలీస్ స్టేషన్ పరిదిలోని ఒక చోరి : (1) పాయలకుంట్ల గ్రామములోని ఒక ఇల్లు. 2024 సంవత్సరములో మే నెలలో ఖాజీపేట పోలీస్ స్టేషన్ పరిదిలోని ఒక చోరి : (1) అప్పనపల్లి గ్రామములోని ఒక ఇల్లు. 2024 సంవత్సరములో మే నెలలో ఎస్ ఎ కే ఎన్ పోలీస్ స్టేషన్ పరిదిలోని ఒక చోరి : (1) అనంవారిపల్లి గ్రామములోని ఒక ఇల్లు. 2024 సంవత్సరములో సెప్టెంబర్ నెలలో దవ్వూర్ పోలీస్ స్టేషన్ పరిదిలోని ఒక చోరి : (1) సంజీవరెడ్డిపల్లి గ్రామములోని ఒక ఇల్లు. 2025 వ సంవత్సరం గుంటూరు ఓల్డ్ బస్ స్టాండ్ పరిదిలోని అపాచి మోటార్ సైకిల్ చోరి. తాళం వేసిన ఇళ్లే టార్గెట్ ... పగలు రెక్కీ... రాత్రి చోరీ:- పైన తెల్పిన ముద్దాయిలు ఎర్రచందనం అక్రమ రవాణే కాకుండా కడప, నెల్లూరు జిల్లాలో తాళం వేసిన ఇల్లు మరియు బంగారు షాప్ ల పై పగలు రెక్కీ చేసి, రాత్రి సమయాలలో తాళాలు పగులగొట్టి ఆ ఇండ్లలోకి చొరబడి, ఆ ఇళ్లల్లో ఉన్న విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. అలాగే గుంటూరు నందు ఒక బైక్ ను దొంగతనం చేసినారు. కొసమెరుపు:- ఇండ్ల చోరిల్లో తక్కువ మొత్తంలో బంగారు ఆభరణాలు లబించడం వల్ల లాభం లేదు అనుకొని, పైన తెలిపిన గుమ్మల్ల వెంకట సుబ్బయ్య ఒకేసారి ఎక్కువ మొత్తంలో బంగారు వెండి ఆభరణాలు దోచుకుకోవాలని ఉద్దేశ్యంతో గత కొంతకాలం నుండి ఇండ్ల చోరిలు వదిలి, బంగారు షాప్ లను టార్గెట్ చేసుకొని కడప, అన్నమయ్య, సత్యసాయి, నెల్లూరు మరియు కాకినాడ జిల్లాల్లో సుమారు పదుల సంక్యలో బంగారు షాప్ లను కొల్లగొట్టి అరెస్ట్ అయి జైలుకు వెళ్ళడం జరిగినది. తీరిక సమయాల్లో పేకాట ఆడుతూ మరియు తన సహచర్లతోటి లంకమల అడవిలోకి నాటు తుపాకితో జంతువుల వేటకు పోతూ వన్యప్రాణులు వేటాడి చంపి, వాటి మాంసంతో విందు చేస్తుంటాడు. వేటకు వాడుతున్న సదరు నాటుతుపాకిని స్వాదినం చేసుకోవడం జరిగినది. ఇద్దరు పాత



నేరస్తులు... పదుల సంఖ్యల్లో కేసులు:- ప్రస్తుతం అరెస్టయిన ఇద్దరు దొంగలలో ఒకరైన గుమ్మళ్ళ వెంకట సుబ్బయ్య మీద గతంలో సుమారు 28 ఎర్రచందనం అక్రమ రవాణా మరియు 38 దొంగతనం కేసులు కలవు. గతంలో ఇతని మీద పీడీ యాక్ట్ మీద జైలుకు వెళ్ళినాడు. మరొక వ్యక్తి నూతి వెంకట సుబ్బయ్య మీద కూడా ఒక ఎర్రచందనం అక్రమ రవాణా కేసు వున్నది. శ్రమించిన ప్రత్యేక పోలీసు బృందాలకు ఎస్పీ గారి ప్రశంస: కడప జిల్లా పోలీసులకు మోస్ట్ వాంటెడ్ గా ఉంటూ పలు చోరీలకు పాల్పడిన గుమ్మళ్ళ వెంకటసుబ్బయ్య మరియు నూతి వెంకటసుబ్బయ్య లను అత్యంత చాకచక్యంగా అరెస్టు చేసి, పైతెలిపిన చోరీ సొత్తును మరియు, ఏరా చందనం దుంగలను, నాటు తుపాకిని రికవరీ చేసిన మైదుకూర్ డీఎస్పీ శ్రీ రాజేంద్ర ప్రసాద్ గారిని మరియు బద్వేల్ రూరల్ సి.ఐ. ఎం. నాగభూషణ్, మైదుకూరు యు జి పి ఎస్, ఇన్స్పెక్టర్ అయిన శ్రీ రమణారెడ్డి, బద్వేల్ రూరల్ యస్.ఐ. కే. శ్రీకాంత్, మైదుకూరు పి ఎస్ ఎస్ ఐ చిరంజీవి, బి.మఠం ఎస్ ఐ శివ ప్రసాద్, మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీ ఇ.జి. అశోక్ కుమార్, ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని 2 లక్షల రూపాయలు సిబిఆర్ ట్రస్టు ద్వారా ప్రకటించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



ఏలూరు జిల్లా ప్రతినిధి - ప్రసాద్(శుభోదయం న్యూస్): పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఆదివాసీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్న నాయకుడిగా మరోసారి తన బాధ్యతను నిరూపించుకున్నారు. ఆగస్టు 9న జరగనున్న "ప్రపంచ ఆదివాసి దినోత్సవం" సందర్భంగా జరిగే కార్యక్రమాల నిర్వహణకు ఆయన సిబిఆర్ ట్రస్టు నుండి రూ.2 లక్షల రూపాయలు ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం రోజున కేఆర్ పురం ఐటీడీఏ కార్యాలయంలో, ఏలూరు జిల్లా కి చెందిన ఏడుమండలాల అధికారులతో పాటు ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చీరీ బాలరాజు మాట్లాడుతూ "ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఆదివాసీలకు విద్య, వైద్యం, జీవనోపాధి అవకాశాలు కల్పించడమే నిజమైన అభివృద్ధి. ఈ దినోత్సవం వారి గౌరవానికి గుర్తుగా జరగాలి. ఆదివాసీల సాంస్కృతిక విలువలను నిలబెట్టాలంటే సామూహికంగా కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో, అట్టహాసంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను శీఘ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న అధికారులు, సంఘాల నాయకులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు పోలవరం నియోజకవర్గంలో ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి స్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# ఘనంగా 11వ జాతీయ చేనేత దినోత్సవం





జంగారెడ్డిగూడెం డివిజన్ ఇంచార్జ్ ఆగష్టు 7(శుభోదయం న్యూస్): భారత దేశ సాంస్కృతిక వారసత్వానికి చేనేతరంగం చిహ్నంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. గురువారం జిల్లా చేనేత మరియు జౌళి శాఖ, ఏలూరు వారి అధ్వర్యం లో 11వ జాతీయ చేనేత దినోత్సవరం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



జెండాఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు. ఏలూరు నగరములోని ఫైర్ స్టేషన్ సెంటర్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయము వరకు చేనేత కార్మికులతో ర్యాలీ నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన చేనేతకు గుర్తుగా దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది ఆగష్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. మన చేనేత వస్త్రాలకు చేనేత వస్త్రాలు మనజాతి కెంతో గర్వకారణమని అన్నారు. ఈ రంగంలో మహిళలు కూడా ఎక్కువ మంది ఉన్నారన్నారు. మన దేశ సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా నిలుస్తున్న చేనేత వస్త్రాలను ఆదరించి చేనేత కార్మికులకు అండగా నిలవాలన్నారు. జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ మన దేశంలో చేనేత రంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. గ్రామాల్లో వ్యవసాయం తర్వాత అత్యధిక జనాభాకు చేనేత రంగమే ఉపాధికల్పిస్తుందన్నారు. మన చేనేత కళాకారుల నేత వస్త్రాలు ఖండాంతర ఖ్యాతి గడించాయన్నారు. ప్రజలు చేనేత ఉత్పత్తులను వాడేలా ప్రోత్సహించడం చేనేత కార్మికులకు మద్ధతు కల్పించడం ఈరోజు ముఖ్యమన్నారు. చేనేత రంగానికి బలమైన ఉతమిచ్చేందుకు ప్రభుత్వం అనేక కొత్త పథకాలు ప్రారంభించించదన్నారు.

# ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన మండల వ్యవసాయ అధికారి



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): జిల్లా పరిధిలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి ఎరువుల నిలువలను, స్టాక్ రిజిస్టర్లను, వివిధ అనుమతి పత్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు మాట్లాడుతూ నంద్యాలలోని ఎరువుల దుకాణాల యజమానులు 1985 చట్టం ప్రకారము ఎరువుల వ్యాపారం చేయాలని, గోడౌన్లు మరియు దుకాణాల యందు ఎరువుల నిలువల వివరాలను ప్రతిరోజు మండల వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని హెచ్చరించారు.అలాగే స్టాక్ రిజిస్టర్లు , స్టాక్ బోర్డులను ప్రతిరోజు అప్డేట్ చేయాలని,అదేవిధంగా ఎరువులను రైతులకు ధరలకే విక్రయించాలని , ప్రతి రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.అలాగే జిల్లాకు కేటాయించిన ఎరువులను నంద్యాల జిల్లాలోనే విక్రయించాలని తెలియచేశారు.

# డక్కిలి మండలం జడ్పిటిసి కలిమిలి రాజేశ్వరి మృతి



వెంకటగిరి, నియోజకవర్గం ఇంచార్జ్ - విసీ సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): తిరుపతి జిల్లా డక్కిలి మండలం చాపలపల్లి వైయస్సార్సీపి వెంకటగిరి నియోజకవర్గం సీనియర్ నాయకులు కలిమిలి రాంప్రసాద్ రెడ్డి సతీమణి డక్కిలి జడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బెంగళూరులోనే ప్రముఖ హాస్పిటల్లో చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచారు ఈ విషయం తెలియగానే ఆమె స్వగ్రామం చాపలపల్లి లో విషాదఛాయలు అల్లుకున్నవి ఆమె మృతి పట్ల గ్రామ మండలంలోని ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి కి గురయ్యారు నియోజకవర్గం మండలం లో ఎన్నో సేవలు అందించిన కలిమిలి రాజేశ్వరి అకాల మరణం జీర్ణించుకోలేకపోతున్నామని ఆమె అందించిన సేవలు చిరస్మరణీయంగా చరిత్రలో నిలిచిపోతాయని అలాంటి మంచి మనసున్న మనిషిని మళ్లీ చూడబోమని మండల గ్రామ ప్రజలు తీవ్ర విచారణ వ్యక్తం చేశారు.

# సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి కార్యదర్శి జి.వి.గురునాధం



యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జి కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్): సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి జి.వి.గురునాధం కోరారు.ఈ సందర్భంగా పుల్లల చెరువు మండలములోని తెల్లగట్ల,ముతుకుల. మానేపల్లి ఐటివరం. ల గ్రామాలలో రాష్ట్ర మహాసభ కరపత్రాలను మంగళవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు డి శ్రీనివాస్ మాట్లాడుతూ,శత జయంతి సందర్భంగా జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఆగస్టు 20 వతేదీ నుండి 25వ తేదీవరకు జరిగే మహా సభలలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. వెలుగొండ పులుసుబ్బయ్య ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని పూర్తి చేయాలని కోరారు, ప్రాజెక్ట్ ద్వారా తీగ లేరు కాలువకు నిధులు కేటాయించి పనులు చేపట్టాలని కోరారు.నిరంతరం ప్రజా ఉద్యమాల్లో పాల్గొని,బడుగు బలహీన వర్గాలు ప్రజా శ్రేయస్సు కోసం పోరాడే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు.ఈ మహాసభల్లో కవులు,మేధావులు, విప్లవకారులు,జిల్లా,రాష్ట్ర,జాతీయ సిపిఐ ప్రతినిధులువివిధ రకాల కళారూపాలతో జరిగే మహా సభకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య సహాయ కార్యదర్శి గుంటూరు.శ్రీనివాసా చారి ముటుకు ల శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు,వై టీ వేంకటేశ్వర్లు మర్రివేముల శాఖ కార్యదర్శి కంచర్ల.గురవయ్య గౌడ్,ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# బస్ జాతను జయప్రదం చేయండి




యర్రగొండపాలెం నియోజకవర్గఇంచార్జి కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్) : 28 వ రాష్ట్ర మహాసభలను పురస్క రించుకొని ఈనెల 9 తేదీ వైపాలెం నియోజకవర్గంలో జరుగు బస్ జాతను జయప్రదం చేయాలనీ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య పిలుపునిచ్చారు. యర్రగొండపాలెం లోని సీపీఐ కార్యాలయంలో గురువారం సీపీఐ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఈనెల 20 నుండి రాష్ట్ర మహా సభలను ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా జిల్లా ప్రజలను చైతన్యం చేసేందుకు బస్సు జాత ఏర్పాటు చేయడం జరిగింది. ఈజాత యర్రగొండపాలెం నియోజకవర్గం లోని పెద్దరవీడు నుండి మొదలై త్రిపురాంతకంలో మొగుస్తుంది. ఈ జాతలో కళాజాతకం బృందం ద్వారా అవగాహన కల్పిస్తూ నియోజకవర్గంలో విస్తృత ప్రచారం జరుగుతుంది. ఈ జాతలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు పాల్గొని జయ ప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. రాష్ట్ర మహా సభలలో జిల్లా అభివృద్ధికి అవసరమైన పలు అంశాలపై చర్చించటం జరుగుతుంది. జిల్లాకు సంబందించిన వెలుగొండ ప్రాజెక్టు కు 4 వేల కోట్లు నిధులు కేటాయించి వెలుగొండ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగు నీరు అందించాలన్నారు. దొనకొండ ను పారిశ్రామిక కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. మార్కాపురంను నూతన జిల్లాగా చేసి పచ్చిమ ప్రకాశం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టేలా చర్యలు తీసుకోవడానికి తీర్మానం చేయడం జరుగుతుంది అన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తున్న పోతిరెడ్డి నాగార్జున్ రెడ్డి



బద్వేల్ నియోజకవర్గం ప్రతినిధి – శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల మండలం అక్కల్ రెడ్డిపల్లి. నాగలకుంట్ల గ్రామపంచాయతీలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ. కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి రామ్మోహన్ రెడ్డి. దస్తగిరి సర్పంచ్. రవి ఎంపీటీసీ. బాలిరెడ్డి. బి బాలకృష్ణ యాదవ్. చంద్రయ్య మాజీ సర్పంచ్. గంగయ్య. శేఖర్. కొండారెడ్డి.జయరాం రెడ్డి. మస్తాన్. డాక్టర్ మాబు. జెకె. కృష్ణారెడ్డి ఈ సందర్భంగా నాగార్జున్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలక్షన్లకు ముందు చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఏ ఒక్కటి పూర్తిగా నెరవేర్చలేదని గత సంవత్సర కాలంలో ఒక్క పథకం కూడా అమలు కాకపోవడం. ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావడం జరిగిందని. నిత్యవసర వస్తువులు. విద్యుత్ చార్జీలు. విపరీతంగా పెరిగాయి అని. రైతులకు పండించిన పంటలకు.గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలైనారని. విద్య. వైద్యం. వ్యవసాయం. కుంటూపడిందని. కార్మికులు. వ్యవసాయ కూలీలకు పనులు లేక వలసలు పోతున్నారని. అధికారంలోకి రాకముందు సంపద సృష్టిస్తామని చెప్పి. ఇప్పుడు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారని ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక లక్ష 95 వేల కోట్లు అప్పులు పాలు చేయడం జరిగిందని. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకముందే ఇంత అప్పు చేశారని పథకాలు అమలు చేస్తే ఇంకా ఎంత అప్పులు చేస్తారో ఈ రాష్ట్రాన్ని దివాలా దిశగా పయనిస్తున్నదని మళ్లీ ఇప్పుడు ఈ ప్రభుత్వం సుపరిపాలన తొలి అడుగు అని . ప్రజల దగ్గరికి కూటమి నాయకులు వస్తున్నారని .ప్రజలందరూ గమనిస్తున్నారని. గత జగనన్న ప్రభుత్వంలో నవరత్నాల కార్యక్రమం లోని అన్ని పథకాలు నేరుగా ప్రజలకి అందేవి. ఇప్పుడు ఆ పథకాలు ఏపీ అందడం లేదని ప్రజలు వాపోతున్నారని ఆయన అన్నారు.

## చేనేతకు చంద్రబాబు ఆర్థిక భరోసా డా.యం.ఉమేష్ రావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం,చేనేత వస్త్రాలపై అయిదు శాతం మేర జీఎస్టీ మినహాయింపు,త్రిఫ్ట్ నిధులు మంజూరు పథకాలకు సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం తెలుగుదేశం పార్టీ బిసి విభాగం ఆధ్వర్యంలో స్థానిక నేత కళాకారులు పద్మశాలి పేట,కుందేటి వారి వీధి కూడలిలో సియం చంద్రబాబు మరియు స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి,అనంతరం అందరికీ స్వీట్లు పంచి పెట్టి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చే పథకానికి గురువారం శ్రీకారం చుడుతున్నారు. ఉచిత విద్యుత్ కోసం ఏడాదికి రూ.190 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది.ఉచిత విద్యుత్ పథకంతో మగ్గాలపై నేసే నేతన్నలకు నెలకు1,233ల చొప్పున్న ఏడాదికి రూ.14,956లు, మర మగ్గాలపై ఆధారపడిన వారికి నెలకు రూ. 2,717ల చొప్పున్న 32,604ల మేర లబ్ధి కలగనుందని తెలిపారు. చేనేత దుస్తుల పైన 5 శాతం జీఎస్టీ మినహాయింపు పథకం ద్వారా ఏడాదికి రూ.15 కోట్లను నేతన్నలకు చెల్లించాలని నిర్ణయించింది.అలాగే ఈ ఏడాది జూన్ వరకూ రూ.545.50 కోట్లు నేతన్నల పెన్షన్ల కోసం చంద్రబాబు ప్రభుత్వం వెచ్చించిందని కొనియాడారు.చేనేత కుటుంబాలకు త్వరలో ఆరోగ్య బీమా పథకం వర్తింప జేయడానికి ప్రణాళికలు రూపొందించారని, త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు కూడా నిర్వహించడానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి,వన్నియకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్,శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్,నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,తీర్థం వేంకటేశ్వర్లు,ఆర్.సుబ్రహ్మణ్యం,వెంకటేష్,మురళీ,మునస్వామి,యుగంధర్,శంకరయ్య, మీనమ్మ,లక్ష్మి,గీత,సులోచన తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో రక్షాబంధన్ ముందస్తు సంబరాలు




శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ శ్రీచైతన్య పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులతో రక్షాబంధన్ వేడుకలను ముందస్తుగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎ.రూపాదేవి మాట్లాడుతూ ఈ రాఖీ పండుగను సోదర, సోదరీమణులు అత్యంత పవిత్రంగా, వారి బంధం పటిష్టంగా ఉండాలని జరుపుకుంటారు. నాకు నువ్వు రక్ష, నీకు నేను రక్ష అన్న సంకేతాన్ని చాటి చెప్పేలా రాఖీ పండుగ ప్రతి ఏడాది శ్రావణ పౌర్ణమి నాడు ఘనంగా జరుపుకుంటాము అని విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాలలో విద్యార్థులు తమ తరగతి స్నేహితులను అన్నదమ్ములుగా భావించి రాఖీ కట్టగా, తిరిగి వారు వారి చెల్లెళ్లకు స్వీట్స్ మరియు గిఫ్ట్ ఇచ్చి రక్షాబంధన్ ప్రాముఖ్యతను విద్యార్థులందరికీ తెలిసేలా చేశారు. ఏజీఎం సురేష్ మాట్లాడుతూ నేటి సమాజంలో సోదర సోదరీమణులు ఒకరికొకరు అండగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ అమ్మాజీ, ఇన్చార్జులు వాసంతి, కల్పన మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సామూహిక ధ్యానం సజ్జన సాంగత్యం కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రప్ప



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): వెంకటగిరి పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇంటింటా ధ్యానం 107వ రోజు సామూహిక ధ్యానం,సజ్జన సాంగత్యం కార్యక్రమం పిరమిడ్ మాస్టర్ చెరుకూరు.శివబాబు నివాసంలో ఏర్పాటు చేయడం జరిగినది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ పిరమిడ్ మాస్టర్ మరియు బిజెపి తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప ధ్యానగురువుగా,ధ్యానంపట్ల అవగాహన పెంచుతూ ఇంతటి చక్కని సందేశాన్ని ఇచ్చారు అనంతరం వెంకటగిరి పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ వారు మాట్లాడుతూ మాకు మరెన్నో కార్యక్రమాలకు విచ్చేసి మార్గదర్శకులుగా నిలవాలని పిరమిడ్ సొసైటీ సభ్యులు కోరారు.

## అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసిన బాధితులు






బద్వేల్ నియోజకవర్గం ప్రతినిధి – శివారెడ్డి (శుభోదయం న్యూస్): బ్రహ్మంగారి మఠం మండలం లింగాలదిన్నె పల్లె గ్రామంలోని భూమిరెడ్డి సుబ్బిరెడ్డి సోమవారం నాడు ఆత్మహత్య ప్రయత్నం చేయటం అపారక స్థితిలో ప్రొద్దుటూరు నందలి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో గురువారం నాడుజిల్లా అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో సుబ్బిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి జరిగిన సంఘటన గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ నందు లెక్కల రమణారెడ్డి మరికొందరిపై బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి,నారాయణ మాట్లాడుతూ సుబ్బిరెడ్డి మరియు లెక్కల రమణారెడ్డికి మధ్య గత కొన్ని సంవత్సరాలుగా భూమి తగాదాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో సుబ్బిరెడ్డి కుటుంబం పట్ల లెక్కల రమణారెడ్డి పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని సోమవారం నాడు స్థానిక బి.మఠం పోలీస్ స్టేషన్ వెళ్లి వచ్చిన తర్వాత భూమిరెడ్డి సుబ్బిరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్నాడని ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నందు తనకు అవమానం జరిగిందని తనకుటుంబ సభ్యుల పట్ల తన పట్ల దుర్మార్గంగా మాట్లాడారని తన కుటుంబ సభ్యులతో తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాక కొన్ని నెలల క్రితం సుబ్బిరెడ్డి కుమారుడు నాగిరెడ్డి చనిపోయాడని ఈ మరణం వెనక అనేక అనుమానాలు ఉన్నాయని వెంటనే నాగిరెడ్డి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించాలని సుబ్బిరెడ్డి కుటుంబ సభ్యులైన మహిళల పట్ల కూడా లెక్కల రమణారెడ్డి పలువురు వ్యక్తుల ద్వారా వేధింపులకు చేశాడని, గ్రీన్ఫీల్డ్ హైవే రోడ్డుకు సంబంధించి పనులు చేపిస్తున్న సూపర్వైజర్ ఒకతను సుబ్బిరెడ్డి కూతుర్ల పట్ల అనుచితంగా అమర్యాదకరంగా వ్యవహరించడమే కాక పలుమార్లు భయభ్రాంతులకు గురి చేశాడని ఇవన్నీ లెక్కల రమణారెడ్డి ఉద్దేశపూర్వకంగానే చేయించినట్లు తమ దృష్టికి వచ్చిందని వారు తెలిపారు. వెంటనే లెక్కల రమణారెడ్డి మరికొందరిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకొని వాస్తవాస్తవాలను వెలికితీయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో సంబంధిత విషయాన్ని జిల్లా ఎస్పీ గారి దృష్టికి తీసుకెళ్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు గుర్రప్ప, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు జయవర్ధన్, ఆర్.ఎస్.పి రాష్ట్ర నాయకులు సుబ్బరాయుడు ఆర్.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు రవిశంకర్ రెడ్డి, సి.ఆర్.వి ప్రసాద్, లోక్ సత్తా నాయకులు కృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ మండల నాయకులు గోవిందు, హరి అజయ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## కోటి రూపాయలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు




రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 7:– మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని మూడవ మరియు నాలుగవ వార్డుల్లో రోడ్ల అభివృద్ధి పనులకు రూ.1 కోటి వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు గురువారం నాడు టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా చౌదరి సుప్రభాత రావు మాట్లాడుతూ మున్సిపాలిటీ వార్డుల్లో రోడ్ల పరిస్థితి గత కొంతకాలంగా తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో గత 15 రోజుల క్రితం ఎమ్మెల్యే రోహిత్ రావు శంకుస్థాపన చేశారని ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రజల సమస్యలను పరిష్కరించడమే మా ప్రాధాన్యం.రోడ్డు పనుల ద్వారా ట్రాఫిక్ సౌకర్యం మెరుగవుతుందన్నారు.అలాగే పట్టణంలో సిసి రోడ్లు డ్రైనేజీ పనులు 15 రోజుల్లోగా ప్రారంభిస్తామన్నారు.అదేవిధంగా సెంట్రల్ లైటింగ్ మెదక్ రోడ్డు నుండి సిద్దిపేట చౌరస్తా మీదుగా ధర్మారం చౌరస్తా వరకు లైటింగ్ ఏర్పాటు చేసి పనులు పూర్తి చేస్తామన్నారు.ఇది రామాయంపేట అభివృద్ధిలో మరో ముందడుగు వేయడం జరుగుతోందన్నారు.మున్సిపాలిటీ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు.అభివృద్ధికి పూర్తిస్థాయిలో పట్టణ ప్రజలు సహకరిస్తే అభివృద్ధికి జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ స్వామినాథన్ 100వ జయంతి




నల్లచెరువు, మండలం రిపోర్టర్ – మాలిక్ బాషా, ఆగస్ట్ 07 (శుభోదయం న్యూస్) : హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్ 100వ జయంతి వేడుకలను జిల్లా రైతు సంఘం సభ్యులు తిరుమల కొండ శ్రీరాములు ఆధ్వర్యంలో స్థానిక సిపిఎం కార్యాలయం నందు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వారు మాట్లాడుతూ దేశ ఆహార భద్రతకు కీలకమైన వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రొఫెసర్ స్వామినాథన్ ప్రముఖుడన్నారు. జాతీయ రైతు కమిషన్ చైర్మన్ గా స్వామినాథన్ వ్యవసాయ నివేదికలు ప్రభుత్వం ముందు ఉంచి రైతులకు అనేక రకాలుగా మంచి జరిగే విధంగా వ్యవహరించారన్నారు.బిపి.పాల్, వెంకటాచలం,రామయ్య వంటి ప్రముఖ శాస్త్రవేత్తల వారసుడిగా స్వామినాథన్ దేశ ముఖ్య ఆహార పంటలైన గోధుమ,వరి వంటి వ్యవసాయాలని మలుపు తిప్పారని కొనియాడారు. కార్యక్రమంలో నల్లచెరువు మండల రైతు సంఘం కార్యదర్శి వెంకటస్వామి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చినుకు పడితే చిత్తడి చిత్తడే చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్న వీధులు



నల్లచెరువు, మండలం రిపోర్టర్ – మాలిక్ బాషా, ఆగస్ట్ 07 (శుభోదయం న్యూస్) : చినుకు పడితే చిత్తడిగా మారి చెరువులను తలపించేలా మండల కేంద్రం నల్లచెరువులో పలు వీధులు దర్శనమిస్తున్నాయి.దీంతో వీధులలోని ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.ఈ వీధులను పట్టించుకునే నాధుడే కరువయ్యారని వీధులలోని ప్రజలు అధికారులు,ప్రజాప్రతినిధులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు,బీసీ కాలనీలో పలు వీధులు,పంచాయతీ కార్యాలయం వీధుల పరిస్థితి మరి అధ్వానంగా తయారయింది.వర్షం పడితే అటువైపు వెళ్లాలంటే బురదలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి.గత ప్రభుత్వంలో పాలకుల దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ వారు పట్టించుకున్న పాపాన పోలేదని వీధులలోని ప్రజలు వాపోతున్నారు.కొద్దిపాటి వర్షానికే వీధులు మొత్తం జలమయమై చెరువులను తలపిస్తూ ఉంటున్నాయని దీంతో ఇళ్లల్లోకి వెళ్లాలన్నా,ఇంటి నుండి బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షపు నీరు వీధులలో నిల్వ ఉండిపోవడంతో వాటిపై వాలే దోమల కారణంగా అనేక అంటువ్యాధుల బారిన పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రహదారిలోనీ గోతులలో నీరు నిల్వ ఉండటంతో గోతులు కనిపించక గోతులలో పడి గాయాల పాలు అవ్వాల్సిన పరిస్థితి దాపరిస్తోందని తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ కార్యాలయం వెనుక వీధిలో పరిస్థితి మరి అధ్వానంగా తయారైందని వీధి ప్రజలు ఆవేదన చెందుతున్నారు.చిన్నపిల్లలను స్కూలుకు పంపడానికి కూడా దారి లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్న తేలికపాటి వర్షానికి నీరు మొత్తం నిల్వ ఉండిపోయి మోకాళ్ళ లోతు నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి వస్తోందని తీవ్ర అగ్రహారం వ్యక్తం చేస్తున్నారు.గత ప్రభుత్వంలో అధికారులు,ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉండే చోటు మాత్రమే అవసరం లేకపోయినా రోడ్లు వేసి అవసరం ఉన్నచోట వదిలేసారని వాపోయారు.ప్రభుత్వాలు మారుతున్నాయి గానీ తమ గోడును పట్టించుకునే నాధుడే కరువయ్యారని వీధుల ప్రజలు పాలకులపై అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి



నంద్యాల ప్రతినిధి– సుధాకర్ (శుభోదయం న్యూస్): పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ఎలక్షన్ ఇంఛార్జ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి పులివెందుల మండలంలోని పోట్రాయిన్ పేట,కానేపల్లి గ్రామాలలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ఓటర్లతో ఎన్డిఏ కూటమి జడ్పీటీసీ అభ్యర్థి శ్రీమతి మారెడ్డి లతారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.టెక్ రవి తమ్ముడు భరత్ రెడ్డి ,షేక్ మహబూబ్ బాషా, స్టేట్ హజ్ కమిటీ డైరెక్టర్, చిన్న వెంకట రెడ్డి, అంజి రెడ్డి , సోమేజ్ రెడ్డి , బింగి రెడ్డి, గంగరాజు, రాజ, చిన్నలక్ష్మణ, సుబ్బారాయుడు, వెంకటనారాయణ రెడ్డి మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రాపు లోను రెన్యూవల్ తో పాటు పంట ఇన్సూరెన్స్ చేసుకోండి యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు రెడ్డి




తనకల్లు, మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్): తనకల్లు మండల పరిధిలోని సదుం గ్రామంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు క్యాంపింగ్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు అకౌంట్ కలిగిన లబ్ధిదారులు పియంజేజేవై, పియంయస్ బివై, ఎపివై, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఇన్సూరెన్స్ లు చేసుకొని ప్రమాద భీమ పొందవచ్చన్నారు.కావున ప్రతి ఒకరు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.గతంలో పియంజేజేవై, పియంయస్ బివై చేసి ప్రమాదం శాత్తు మరణించిన గేమే నాయక్ తండాకు చెందిన మోహన్ నాయక్, చంద్రబాబు నాయుడు కాలనీ కీ చెందిన శ్రీనివాసులు కు వారి కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ డబ్బులు అంద జేశమన్నారు. క్రాప్ లోను రెన్యూవల్ తో పాటు పంట ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటకు ఎకరానికి 650/– టమోటా, 1619/– పత్తికి1923/– కంది ఇతర పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలి అని అన్నారు. యూనియన్ బ్యాంకు సేవలు అన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు. అలాగే క్రాపు లోనులు, గోల్డ్ లోనులు పొంద వచ్చు అని అన్నారు. ఫిక్సడ్ డిపాసీట్లు కూడా చేసి అధిక వడ్డీ పొందవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు సిబ్బంది నవీన్ కూమర్, ఆది, బ్యాంకు మిత్రాలు రమేష్, శీను లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



దోర్నాల మండల రిపోర్టర్ అవులయ్య (శుభోదయం న్యూస్) ప్రకాశం జిల్లా దోర్నాల మండలం యడవల్లి గ్రామంలో సింగా వారి వివాహమహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వాదించిన వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి యర్రగొండపాలెం శాసనసభ్యులు శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ గారు దోర్నాల మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గంట వెంకటరమణారెడ్డి మరియు, వైసీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు

## జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆకస్మిక తనిఖీలు



బాపట్ల జిల్లా, (శుభోదయం న్యూస్) : నిజాంపట్నం మండలం ముత్తుపల్లి గ్రామ హరిజనవాడలో కలెక్టర్ పర్యటన గ్రామంలో నమోదైన డెంగ్యూ కేసు నేపథ్యంలో అధికారుల చర్యలపై ఆరా కాలనీలో పరిశుభ్రతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్– గ్రామంలో పారిశుధ్య చర్యలు మరింత కట్టుదిట్టంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు.

## పొగాకు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు





బాపట్ల జిల్లా (శుభోదయం న్యూస్): కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం హైవే దగ్గర ఎఫ్.సి.ఐ గూడమ్స్ లో నల్ల బర్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు తో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షులు ఏపూరి భూపతిరావు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అధికారులు, పాల్గొన్నారు

## మణి కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న మండల అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజు నాయుడు



తొట్టంబేడు, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : మండలంలోని తొట్టంబేడు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు సుబ్రహ్మణ్యం అలియాస్ మణి కుమార్తె వివాహ వేడుకలు శ్రీకాళహస్తిలోని ఓ కళ్యాణ మండపంలో జరిగాయి. ఈ వివాహ వేడుకలకు తెలుగుదేశం పార్టీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు రావిళ్ళ.మునిరాజు నాయుడు పాల్గొని వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు భాస్కర్ ముదిరాజ్,వాసు నాయుడు, కమలాకర్, చింత గింజల సునీల్, పలువురు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీసీ బిల్లును కేంద్రం ఆమోదించకపోతే మోడీని గద్దె దించుతాం : సిఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ : బీసీ బిల్లును కేంద్రం ఆమోదించకపోతే మోడీని గద్దె దించుతాం అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. గురువారం న్యూఢిల్లీలో మీడియాతో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ . బీసీ రిజర్వేషన్లపై మరోసారి కేంద్రంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. బీసీ బిల్లును కేంద్రం ఆమోదించకపోతే మోడీని గద్దె దించుతాం అని హెచ్చరించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుపై చర్చ జరగాలని కోరుతూ, విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను కేంద్రం వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీసీ కోటా బిల్లులు కేంద్రం దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. నాలుగు నెలలుగా రాష్ట్రపతి దగ్గర కూడా ఈ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరుతున్నా రాష్ట్రపతి ఇప్పటివరకు సమయం కేటాయించలేదు అని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు 3 మార్గాలు ఉన్నాయన్నారు. 50 శాతం సీలింగ్‌పై గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని పక్కన పెట్టి జీవో ఇవ్వాలని, జీవో ఇస్తే.. ఎవరైనా కోర్టుకు వెళ్తే స్టే ఇస్తుంది కాబట్టి మొదటి మార్గం సాధ్యం కాదు అని చెప్పారు. ఇప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టకుండా ఆపడం రెండో మార్గం అని సూచించారు. వీటిని ఆపితే కేంద్రం నుంచి నిధులు వస్తాయన్నారు. మూడో మార్గం పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వడం అని అన్నారు. బీసీలకు 42 శాతం సీట్లపై ఇతర పార్టీలపైనా ఒత్తిడి తెస్తాం అని సిఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో కులగణన చేపట్టడం రాహుల్ గాంధీ సూచన మేరకే జరిగిందని రేవంత్ తెలిపారు. రాహుల్ గాంధీ ఆశయం ప్రకారం 42 శాతం బీసీ కోటా బిల్లు తెచ్చామన్నారు. ఈ కోటా సాధించే వరకు పోరాటం కొనసాగిస్తాం అని స్పష్టం చేశారు. కేంద్రం బిల్లులను ఆమోదించాలని డిమాండ్ చేస్తూ, ఆగస్టు 6వ తేదీన జంతర్ మంతర్ దగ్గర మహా ధర్నా నిర్వహించారని గుర్తు చేశారు. ఈ ధర్నాకు సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంఘాల నాయకులు, పార్టీలోని బీసీ నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని తెలిపారు.

## ఓటర్ల జాబితా చూపించడానికి ఈసీకి ఇబ్బందేంటి?



**న్యూఢిల్లీ,:** ఎన్నికల సంఘం తీరుపై మరోసారి కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో ఆయన మాట్లాడారు. ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణపై అనుమానం కలుగుతుందన్నారు. అంచనాలకు అందని ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై అధ్యయనం చేశామని.. హర్యానా, మధ్యప్రదేశ్?లోనూ అంచనాలకు భిన్నంగా ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఉన్న చోట కూడా బీజేపీకి మాత్రమే అనుకూలంగా వస్తున్నాయని చెప్పారు. బీహార్?లో లక్షల మంది ఓట్లను తొలగించారన్నారు. బీహార్?లో ఓట్ల తొలగింపుపై ఈసీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అయినా ఓటర్ల జాబితా దేశ సంపద అని.. దానిని ఎందుకు చూపించట్లేదు? అని నిలదీశారు. మహారాష్ట్రలో ఐదు నెలల్లోనే 40 లక్షల మంది ఓటర్లు నమోదయ్యారని.. ఐదేళ్లలో నమోదైన వారి కంటే.. ఐదు నెలల్లో నమోదైన ఓటర్లే ఎక్కువగా ఉన్నారని చెప్పారు. మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య సమయంలో కోటి మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. ఆ సమయంలో ఓటర్ల జాబితా ఇచ్చేందుకు ఈసీ నిరాకరించిందని గుర్తుచేశారు. దేశ సంపదను చూపించేందుకు ఎన్నికల సంఘానికి వచ్చిన ఇబ్బందేంటి? అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సర్వేపై తీవ్ర ఆందోళనలు జరుగుతున్నాయి. అటు పార్లమెంట్‌లోనూ.. ఇటు అసెంబ్లీలోనూ నేతలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా ఈసీ పని చేస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. 65 లక్షల ఓట్లు ఎందుకు తొలగించాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే దీనిపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు ఆందోళనలు చేపట్టగా వాయిదాల పర్వం కొనసాగుతోంది. బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికల జరగనున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. ఇందుకోసం ఈసీ తీవ్ర కసరత్తు చేస్తోంది. సెప్టెంబర్ నెలాఖరు నాటికి తుది ఓటర్ల జాబితాను ప్రకటించనుంది. అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఇక అన్ని పార్టీలు కదనరంగంలోకి దిగాయి. ప్రచారంలో దూసుకుపోతున్నారు.

## పులివెందులలోని అరాచకాలు పోలీసులకు కనిపించడం లేదా..?



**అమరావతి,:** కడప జిల్లా పులివెందులలో జరిగే జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అరాచకాలు, ఆకృత్యాలు జరుగుతున్న పోలీసులకు పట్టడం లేదని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్నినాని విమర్శించారు. పోలీసులు ఉద్యోగం చేయడం మానేశారు.. కర్నూల్ డీఐజీ అయితే, వైసీపీ నాయకులు పత్తి వ్యాపారం చేయడం వలన కడప ఎన్నికలలో అరాచకాలు జరిగిందడం బాధాకరం.. నామినేషన్ రోజు ఎవరైతే ఉన్నారో వాళ్లే రిపీటెడ్ గా గొడవల్లో పాల్గొంటున్నారు అని డీఐజీ అంటున్నారు.. కొంతమంది పోలీసులు కడప జిల్లా పులివెందులలో ఉద్యోగాలు చేయకుండా పత్తి వ్యాపారం చేయడం వల్లనే గొడవలు జరుగుతున్నాయని పేర్నినాని ఆరోపించారు. అయితే, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ , వేల్పుల రాము ప్లాన్ ప్రకారం అయితే తలలు తెగిపోవాలని మాజీమంత్రి పేర్నినాని సంచలన వ్యాఖ్యలు.. కానీ, పోలీస్ గ్యారెంటీ అవార్డ్స్, పీపీఎంఎస్, పీపీజీఏ, రాష్ట్రపతి ఉన్నతమైన సేవలు అందించే అవార్డులను.. ఎమ్మెల్సీ రమేష్, వేల్పూర్ రాములకి ఇవ్వాలని రాష్ట్రపతిని ఆయన కోరారు. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల నాయకులకు రాజకీయ శుక్లాలు వచ్చాయి.. అధికారం కోల్పోతే రాజకీయ శుక్లాలు పోతాయి.. దాని కోసం ఒక మూడున్నర సంవత్సరాలు వేచి ఉండాలని పేర్నినాని సూచించారు.

## పవన్ ఏం అయ్యారో.. ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదు..

పులివెందుల ప్రజలు రౌడీయిజం మాకు వద్దని కూటమి ప్రభుత్వం వైపు నడుస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ప్రశాంతమైన తిరుపతిలో రౌడీయిజం చేయడం కఠినమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని ఆదేశించామన్నారు. బైక్ అద్దెకు తీసుకుని డబ్బులు ఇవ్వలేదని వైసీపీ నేతలు పవన్ అనే యువకుడిని దారుణంగా కొట్టారు.. గతంలో కూడా డాక్టర్ సుధాకర్, దళిత యువకుడిని చంపి డోర్ డెలివరీ చేశారు అని ఆరోపించారు. దాడి చేసినా వైసీపీ నేతలు అనిల్ రెడ్డి, జగదీష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఇంట్లో దాకున్నారు.. భూమన ఇంట్లో ఉంటే వారిని పోలీసులు అరెస్టు చేశారు అని మంత్రి అనగాని పేర్కొన్నారు. అయితే, దళితులపై వైసీపీ నేతల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని అనగాని సత్యప్రసాద్ తెలిపారు. భూమన అనుచరులు ప్రజలపై దాడులు చేస్తున్నారు.. ఒక దళిత యువకుడ్ని బంధించి కొట్టారు.. పవన్ ఏం అయ్యాడో.. ఎక్కడ ఉన్నాడో తెలియని పరిస్థితి ఏర్పడింది.. పవన్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు అని చెప్పుకొచ్చాడు.

## ఈ సంక్షోభాన్ని దాటేదెలా?



రష్యా నుంచి ముడిచమురు కొనుగోళ్లు ఆపాలంటూ వరస బెదిరింపులతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్‌ను లొంగదీసుకోవాలని చూస్తున్న తరుణంలో మన విదేశాంగ శాఖ తొలిసారి నేరుగా బదులీయటం కీలక పరిణామం. దీనికి రెండురోజుల ముందు స్థానిక తయారీ ఉత్పత్తుల్ని, సరుకుల్ని కొనుగోలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ పౌరులకు పిలుపునిచ్చారు. అమెరికాలో గత కొన్ని దశాబ్దాలుగా అక్కడి ప్రభుత్వాలు అనుసరిస్తూ వచ్చిన అస్తవ్యస్త విధానాల పర్యవసానంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభానికి ట్రంప్ అమలుచేసిన తప్పుడు నిర్ణయాలు తోడై ఆర్థికవ్యవస్థను ఊపిరాడకుండా చేస్తున్నాయి. వాటి నుంచి బయటపడటం కోసం ఆయన ప్రపంచ దేశాలపై ఆర్థిక దండయాత్ర మొదలుపెట్టారు. చైనాపై 145 శాతం సుంకాల మోత మోగించటంతో మొదలుపెట్టి తన సన్నిహిత దేశాలపై సైతం దాదాపు 50 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించి, అనంతరకాలంలో వెనక్కితగ్గారు. ఈ దశలో ఆయన మన జోలికి రాలేదు. మోదీతో 2016 నుంచీ ఉన్న సాన్నిహిత్యంతో ఆయన తాను చెప్పినట్టు వింటారని ట్రంప్ భ్రమపడ్డారు. తీరా కథ అడ్డం తిరిగేసరికి ఆగ్రహోదగ్రుడవుతున్నారు. అందుకే కావొచ్చు... జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, బంగ్లాదేశ్, ఇండొనేసియాలపై 15-20 శాతంమధ్య సుంకాలు విధించిన పెద్ద మనిషి మన దగ్గరకొచ్చేసరికి ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలతోపాటు రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లు ఆపకపోతే మరిన్ని రెట్లు పెంచుతానని హెచ్చరించారు. స్వదేశంలో సంపన్నులకూ, పారిశ్రామికవేత్తలకూ లక్షల కోట్ల డాలర్ల పన్ను రాయితీలు ప్రకటించి, ప్రపంచ దేశాలపై అదనపు సుంకాలు విధించటం ద్వారా ఆ లోటును భర్తీ చేసుకోవాలన్నది ఆయన పథకం. దీన్ని చూసీచూడనట్టు వూరుకుంటే ఈ బాణీయే కొనసాగిస్తారు. అమెరికా పాటించే ద్వంద్వ ప్రమాణాలు ఎవరికీ తెలియనివి కాదు. కానీ ట్రంప్ మరింత నిస్సిగ్గుగా వాటిని ఆచరిస్తున్నారు. ఒకపక్క తమ అణు పరిశ్రమలకు కావాల్సిన యురేనియం హెక్సాఫ్లోరైడ్ అయినా, విద్యుత్ వాహనాల తయారీలో అవసరమైన ప్లాటినం రకానికి చెందిన రసాయన మూలకం పలాడియం, ఎరువులు, రసాయనాలు వంటివి రష్యా నుంచి ఇప్పటికీ దిగుమతి చేసుకుంటూ... మనం మాత్రం ముడి చమురు కొనకూడదని శాసిస్తున్నారు. అందుకే మోదీ స్వదేశీ ఉత్పత్తుల్నీ, సరుకులనూ కొనటం అత్యవసరమని ప్రజలకు పిలుపునిచ్చారు. వర్తమాన తరుణంలో స్వదేశీ నినాదం సరైనది. అయిదేళ్లక్రితమే మోదీ ఆత్మనిర్భర్ భారత్ గురించి మాట్లాడారు. కానీ ఎన్డీయే ప్రభుత్వం ఈ విషయంలో పెద్దగా చేసిందేం లేదు. అంతక్రితం ఉన్న యూపీఏ ప్రభుత్వం గురించి చెప్పనవసరం లేదు. గతంలో ప్రణాళికా సంఘం, ఇప్పుడు నీతి ఆయోగ్... అలాగే సాంకేతిక నిపుణుల మాట చెల్లుబాటవుతూ వచ్చింది. ఆరెస్సెస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ ఈ విషయంలో ప్రభుత్వాన్ని గతంలో పలుమార్లు తీవ్రంగా తప్పుబట్టింది. కానీ మారిందేమీ లేదు. ట్రంప్ ఒక్కరే కాదు...బ్రిటన్, ఈయూలు సైతం తమ వినియోగవస్తువులపై, యంత్ర పరిక రాలపై సుంకాలు తగ్గించమంటున్నాయి. అందుకు తలొగ్గితే మన సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) దెబ్బతింటాయి. అమెరికా ఒత్తిళ్లకు లొంగితే మన సాగు రంగం, పాడి పరిశ్రమ రంగం ఇబ్బందుల్లో పడతాయి. ఆ రెండు రంగాలపైనా 70 కోట్లమంది ప్రజానీకం ఆధారపడతారు. ఇవిగాక జన్యుమార్పిడి చేసిన మొక్కజొన్న, సోయాబీన్స్ దిగుమతి చేసు కోవాలని అమెరికా కోరుకుంటోంది. ఇది ప్రమాదకరం. వాటి సంగతలావుంచి వర్తమాన అనిశ్చిత వాతావరణంలో మనమే కాదు...దేశాలన్నీ ఆత్మరక్షణ బాటపట్టాయి. తమ దేశానికొచ్చే విదేశీ సరుకుపై అధిక సుంకాలు విధించటం, విదేశాలకు ఎగుమతయ్యే తమ సరుకుకు తక్కువ సుంకాల కోసం ఒత్తిళ్లు తీసుకురావటం రివాజైంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రానిక్స్, సెమీకండ క్టర్లు, రక్షణ, సౌరశక్తి రంగాలకు పెద్దయెత్తున ప్రోత్సాహకాలు ఇవ్వాల్సివుంది. పెంచిన సుంకాల పరిధిలో ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, ఇంధన ఉత్పత్తులు వగైరాలను ట్రంప్ మినహాయించారు. 'జాతీయ ప్రయోజనాల రీత్యా' ఈ నిర్ణయం తీసుకున్నారట. కానీ ఆ ఉత్పత్తుల ధరల్ని పెంచటం ద్వారా అదనపు రాబడికి వ్యూహరచన చేస్తే అమెరికా సృష్టించదల్చుకున్న సంక్షోభంనుంచి ఉపశమనం పొందవచ్చు. అయితే వాటికి మెరుగైన ప్రోత్సాహకాలు అందిస్తేనే ఇదంతా సాధ్యం. ఇప్పటికే స్వావలంబన దిశగా అడుగులేసివుంటే వేరుగా వుండేది. ఇప్పటికిప్పుడు తీసుకునే చర్యల నుంచి వెంటనే ఫలితాన్ని ఆశించలేం. ఈలోగా అమెరికా కోరుతున్నదేమిటో, మన తిరస్కరణకు కారణమేమిటో పార్లమెంటు వేదికగా తేటతెల్లం చేయాలి. అది జరిగితేనే ప్రజలు మరింత దృఢంగా మద్దతిస్తారు.

## గడప దాటొద్దా..?


'యత్ర నార్యస్తు పూజ్యంతే రమన్తే తత్ర దేవతా:'(ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు) అనే నోటితోనే 'నస్త్రీ స్వాతంత్ర మర్హతి' అంటారు. దీన్ని బీజేపీ మరింతగా ముందుకు తీసుకుపోతోంది. కాబట్టే ఒక పక్క 'బేటీ బచావో బేటీ పడావో' అంటూనే మరోపక్క ఆమెను తిరిగి నాలుగ్గోడలకు పరిమితం చేసే వ్యాఖ్యలు చేస్తోంది. ముఖ్యంగా కాషాయజెండా రాజ్యమేలుతున్న రాష్ట్రాల్లో ఈ ప్రయత్నం యధేచ్ఛగా సాగుతోంది. అందునా మన ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్ ఇలాంటి వాటిలో ఎప్పుడూ ముందు భాగానే ఉంటుంది. ఇటీవల ఆ రాష్ట్రంలో 'మహిళలపై లైంగిక దాడులు జరగకుండా ఉండాలంటే వాళ్లు ఇంట్లోనే ఉండాలి. అలా కాదని వెళ్తే లైంగికదాడులు జరగొచ్చు' అనే పోస్టర్లు వెలిశాయి. పైనచెప్పిన పోస్టర్లను అహ్మదాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పాన్సర్ చేశారు. అంటే మహిళలు బయటకు వస్తే మేము కాపాడలేమని పోలీసులు చేతులెత్తేసినట్టేగా. కాపాడాల్సిన వారే ఇలా వ్యవహరించడం తీవ్రమైన విషయం. స్త్రీల వ్యక్తిత్వాన్ని కించపరిచే ఈ పోస్టర్లను మహిళా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇలాంటి పోస్టర్లకు అనుమతి ఎలా ఇస్తారంటూ అధికారులను నిలదీశాయి. తమ తప్పును తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఈ పోస్టర్లను తొలగించేశారు. అయితే తమకు తెలియకుండా ఈ పోస్టర్లు అంటించారంటూ తమ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. మహిళల పట్ల ఇలాంటి ఆలోచనా ధోరణి మనదేశంలో కొత్తేమీ కాదు. నిర్భయ ఘటనలో ఇది మనకు మరింత స్పష్టం కనిపిస్తుంది. మహిళలపై లైంగిక దాడులు జరిగిన ప్రతీసారీ వారి వస్త్రధారణను వేలెత్తి చూపుతున్నారు. 'ఆ సమయంలో ఆమె అక్కడ ఎందుకు ఉంది' అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇవి సాధారణ ప్రజల నుండి కాదు సాక్షాత్తు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల నోటి నుండే వస్తున్నాయి. నాయకుల ఆలోచనా ధోరణే ఇలా ఉంటే ఇక సామాన్యుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సింది ఏముంటుంది? అందరూ కలిసి 'మీ సమస్యలకు మీరే బాధ్యులు' అంటూ మహిళలను ఆత్మన్యూనత భావనలోకి నెట్టేస్తున్నారు. ఒకపక్క మనప్రధాని ఎక్కడికి వెళ్లినా 'బేటీ బచావో' అనే నినాదాన్ని భుజాన మోసుకొని వెళుతున్నారు. మహిళల గురించి, అభ్యున్నతి గురించి, రక్షణ గురించి చెవులు చిల్లులు పడేలా ఉపన్యాసాలిస్తున్నారు. కానీ ఇలా మహిళలను కించపరిచే విధంగా మాట్లాడే నాయకుల నోటికి తాళాలు వేసేందుకు మాత్రం సిద్ధపడటం లేదు. దీనికి కారణం 'మహిళలంటే నాలుగ్గోడలకే పరిమితం కావాలి, భర్తను సుఖపెట్టడమే ఆమెపని, పిల్లల్ని కనే యంత్రంగా మాత్రమే ఆమె ఉండాలి' అని చెబుతున్న మనుధర్మాన్ని నెత్తిన మోయడమే. ఇలాంటి మనుధర్మాన్ని, సనాతన ధర్మాన్ని యావత్ దేశం పాటించాలని ప్రచారం చేస్తుంది బీజేపీ. కాబట్టే మహిళల స్వేచ్ఛను




వీళ్లు భరించలేరు. చదువులు, ఉద్యోగాలంటూ అమ్మాయిలు బయటకు వస్తే ఒప్పుకోరు. ప్రశ్నిస్తే అసలే తట్టుకోలేరు. 'పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే, సుతా రక్షతి వార్థక్యే'(స్త్రీలు బాల్యంలో తండ్రి రక్షణలో, యవ్వనంలో భర్త రక్షణలో, వృద్ధాప్యంలో కొడుకు రక్షణలో ఉండాలి) అనే సూక్తిని తూ.చ తప్పక పాటించే ఈ 'మను'సైన్యం నీడన మహిళలను కించపరిచే ఇలాంటి పోస్టర్లను తప్ప వేరే ఆశించలేము. ఇలాంటి భావజాలాన్ని పెంచిపోషించే పాలకులున్నంత కాలం స్త్రీలకు నిజమైన స్వేచ్ఛ దొరకుతుందనుకోలేం! మోడీ పైకిచెప్పే నినాదాలు నేడు అపహాస్యంగా మారిపోయాయి. దేశంలో రోజుకు 86 లైంగిక దాడులు నమోదవుతున్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇవి ప్రధానంగా బీజేపీ పాలనలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలలోనే జరుగుతున్నాయి. దేశంలో ప్రతి ఏడాది వందల మంది మహిళలు, బాలికలు వ్యభిచార గృహాలకు నెట్టివేయబడుతున్నారు. ప్రతియేటా ముప్పైవేలమంది బాలికలు అక్రమరవాణా ఊబిలో చిక్కుకుంటున్నారు. భ్రూణహత్యలు, యాసిడ్ దాడులు, బాల్యవివాహాలు, లైంగికదాడులు హత్యలతో మహిళల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ఇలాంటి సమస్యల సుడిగుండం నుండి బయటపడినప్పుడు మాత్రమే స్త్రీ జాతి విముక్తి సాధిస్తుంది. అన్ని రంగాలలో స్త్రీలు అభివృద్ధి సాధించిన నాడే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుంది. అలా నడవాలంటే సమాజంలో మార్పు అవసరం. ముఖ్యంగా దేశాన్ని పాలిస్తున్న పాలకుల ఆలోచనా ధోరణిలో మార్పు రావాలి. 'ఇంటికి వెలుగు ఇల్లాలు' అని మాత్రమే కాదు 'సమాజానికి వెలుగు స్త్రీజాతి' అనే నిజాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఏది ఏటామైనా మనుధర్మం మొదలు నేటి వరకు వెండుతున్న ఆంక్షల అడ్డుగోడలను బద్దలు కొడుతూ తన అస్థిత్వం కోసం స్త్రీ చేస్తున్న పోరాటం గొప్పది. దీన్ని ప్రజలు, మరీ ముఖ్యంగా పాలకులు గుర్తించాలి. ఇప్పటికైనా ఆమెను వెనక్కు నెట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలి.

## జీవన్మృతుల త్యాగనిరతి

కన్నుతెరిస్తే జననం కన్ను మూస్తే మరణం ఈ రెండింటి మధ్యే మనిషి జీవితం మరణశయ్యపై ఉంటూ మరో నలుగురికి అవయవాలను ప్రసాదించడం ఒక ఉత్కృష్ట సేవాయజ్ఞం. ఆత్మీయుడిని కోల్పోయిన పెనువిషాదంలో ఉన్నప్పటికీ అతడి అవయవదానానికి ముందుకొచ్చి పెద్దమనసు చాటుకుంటున్న కుటుంబీకుల సేవాస్ఫూర్తి మహోన్నతం. మట్టిలో కలిసే అవయవాలు మరో మనిషి శరీరంలోకి వెళ్లి నిత్యచేతనంగా నిలుస్తాయన్న భావనే వారి కార్యశీలతలోని నిగూఢార్థం. ఒకరికి గుండె, ఒకరికి ఊపిరితిత్తులు, మరొకరికి కళ్లు, ఇంకొకరికి మరో అవయవం.. ఇలా అవయవాల కోసం నిరీక్షిస్తున్న ఆపన్నులెందరో! వారి అవసరాలను తీర్చేందుకు 'జీవన్‌దాన్' అనుసంధానకర్తగా నిలుస్తోంది. ప్రస్తుతం దేశంలోనే 'అత్యధిక సంఖ్యలో అవయవ దాతలు ఉన్న రాష్ట్రం'గా తెలంగాణ ప్రథమస్థానంలో నిలిచింది. ఇది నిజంగా గొప్ప విషయం. దాతృత్వానికి నిజమైన అర్థంగా నేడు తెలంగాణ రాష్ట్రం నిలవడం మనందరికీ గర్వకారణం. దానాలన్నిట్లోకెల్లా ఫలానా దానమే గొప్పదని తరచూ అంటుంటాం. సందర్భాన్ని బట్టి ఒక్కోసారి విద్యాదానమనీ, అన్నదానమనీ, ఇలా ఆ పేరు మారుతుంటుందంతే. కానీ ఎప్పటికీ మారని గొప్పదానం ప్రాణదానం. దానికి దోహదపడేదే అవయవదానం. ఆధునిక వైద్య శాస్త్రంలోని పురోగతి వల్ల ఇప్పుడు అవయవాలను మార్చి ప్రాణాలను నిలబెట్టగల సామర్థ్యం మన వైద్యులకు ఉంది. అయితే జీవించి ఉన్నవారు తమ అవయవాలను ఎలా ఇవ్వగలరు? అందుకే జీవన్మృతుల (బ్రెయిన్‌డెడ్ పర్సన్స్) నుంచి అవయవాలను సేకరించే అవకాశాన్ని కల్పించేలా మనం చట్టబద్ధమైన మార్గదర్శకాలనూ ఏర్పాటు చేసుకున్నాం. కానీ, మరణానంతరం వారి కుటుంబ సభ్యులకు, బంధువులకు గల సాంప్రదాయపు ఆలోచనలు, ఆచారాలు, కట్టుబాట్లు, అవగాహనాలోపం తదితర కారణాల వల్ల అవయవదానం చేయడానికి అందరూ అంగీకరించకపోవడం వంటి కారణాలు అవాంతరాలుగా ఉన్నాయి. వాటిని పారదోలేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నాయి. స్వచ్ఛంద బ్లడ్‌బ్యాంకులాగా, స్వచ్ఛంద అవయవదాన కేంద్రాలు కూడా పెరగాలి. మేధావులు, ప్రజాసంఘాలు కూడా అవయవ దానంపై ప్రచారం చేయడం ద్వారా అవగహన పెంచే ప్రయత్నం చేయాలి. ఏటా దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో లక్షన్నర మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో కొందరి అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకొచ్చినా కీలక అవయవాల కొరత తీరుతుంది. 2017లోనే అవయవదానాన్ని ఫ్రాన్స్ దేశం తప్పనిసరి చేసింది. ఎవరికైనా ఇష్టం లేకపోతే ముందుగానే ప్రభుత్వానికి తెలియజేయాలి. లేదంటే వ్యక్తి చనిపోగానే వైద్యులు తప్పనిసరిగా వారి అవయవాల్ని సేకరిస్తారు. డెన్మార్క్, జర్మనీ, ఐర్లాండ్, నెదర్లాండ్స్ తదితర దేశాల్లో అవయవదానంపై ముందే ఒక నిర్ణయం తీసుకోవాలి. కానీ, మన కేంద్ర ప్రభుత్వం అవయవాలను త్వరితగతిన తరలించేందుకు గ్రీన్ కారిడార్‌లను ఏర్పాటు చేయడానికి



ఆదేశాలు జారీ చేసిందే తప్ప దాని ప్రాధాన్యతను గుర్తించి సరైన అవగాహన కల్పించే చర్యలు మాత్రం చేపట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వాలే ఈ విషయంలో కిందా మీదా పడుతూ దాతలను చైతన్యం చేసే కార్యక్రమాలను చేపడుతున్నాయి. మన రాష్ట్రంలో యువత సైతం పుట్టినరోజు, పెండ్లిరోజులాంటి ప్రత్యేక సందర్భాల్లో అవయవ దాతలుగా పేరు నమోదు చేసుకుంటున్నారు. ఇదొక మంచి పరిణామం.ఓ వైపు అవయవాలకోసం ఎంతోమంది ఎదురుచూస్తుంటే- చాలాచోట్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో జీవన్మృతుల కేసులొస్తున్నా సరిగ్గా స్పందించడం లేదన్న విమర్శలున్నాయి. తమకు అదనపు భారమవు తుందని భావించడం ఒక కారణమైతే వైద్యుల కొరతను సాకుగా చూపించి ఆస్పత్రులు మహాశయానికి గండికొడుతున్నాయి. ప్రయివేటు వైద్యాలయాలూ ఇందుకు మినహాయింపు కాదు

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో ఎనిమిది మందిని బతికించే అవకాశం ఉంది. బ్రెయిన్ డెడ్ కేసు రాగానే వైద్యులు ముందుగా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానం ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలి. అందుకు వారు సమ్మతించేలా చూడాలి. వంద పడకలు దాటిన ప్రతి ఆస్పత్రి జీవన్‌దాన్ ట్రస్ట్‌లో నమోదు చేసుకోవాలి. చాలాచోట్ల అది జరగడం లేదు. ఈ తీరు మారాలి. అవయవదానం విషయంలో ఆస్పత్రులు, వైద్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. మరోవైపు, కీలక అవయవాల కొరతను ఆసరాగా చేసుకుని దేశంలో అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఆర్థిక కష్టాలతో సతమతమవుతున్న అభాగ్యులు ఇలాంటి నేర ముఠాల మాయలో పడి తీవ్రంగా నష్ట పోతున్నారు. అవయవ అక్రమ దందాసురులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి. మరణానం తర అవయవదానం ఎందరికో ప్రాణభిక్ష పెడుతుందనే అంశాన్ని ప్రతిఒక్కరూ తమ బంధుమిత్రులకు తెలియ జేయాలి. అందరూ అవయవదానానికి ముందుకు రావాలి.అప్పుడే దినమొక గండంగా మారినవారి జీవితాల్లో నవ వసంతాలు విరబూస్తాయి.

# కేసీఆర్ అరెస్ట్ అవుతారా?..
# క్లారిటీ ఇచ్చిన సీఎం రేవంత్



న్యూఢిల్లీ: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను అరెస్ట్‌పై సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ఒత్తిడి పెంచాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ నేతల బృందం ఢిల్లీలో పర్యటిస్తోంది. పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ చిట్‌చాట్ నిర్వహించారు. కేసీఆర్‌ను నేనెందుకు జైల్లో వేస్తా.. ఆయనే స్వీయ నియంత్రణగా జైల్లో ఉన్నట్లు ఫామ్ హౌస్‌లో ఉన్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌కు.. చర్లపల్లి జైలుకు తేడా లేదు. ఫామ్ హౌస్‌లో పోలీసుల పర్యవేక్షణ ఉంటది. జైల్లో పోలీసుల పహారా ఉంటుంది. అప్పుడప్పుడు జైలుకు విజిటర్స్ వస్తుంటారు.. అలాగే ఫామ్ హౌస్‌కి విజిటర్స్ వెళ్లి వస్తున్నారు. కేసీఆర్‌ను ఓడించడమే పెద్ద శిక్ష. నేనెందుకు విద్వేష రాజకీయాలు చేస్తా. మేం దుప్పటి కప్పుకొని పడుకున్నా తెలంగాణ ప్రజలు రెండోసారి కాంగ్రెస్ గెలిపిస్తారు. బీహార్ ఎన్నికలతో పాటే జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక వస్తుందని అనుకుంటున్నా. బీఆర్ఎస్ నేతలు కూడా నైతిక విజయం అంటే నైతికత కూడా ఆత్మహత్య చేసుకుంటుంది. బీఆర్ఎస్ నేతలకు నైతికత గురించి మాట్లాడే అర్హత లేదు . బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలన్నది మా విధానం. బీజేపీ నేతలు.. మీకు కావలసిన పద్ధతిలో చట్టం చేయండి. కిషన్ రెడ్డికి బీసీ బిల్లులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి 150 సీట్ల కంటే ఎక్కువ రానివ్వం. 2029లో ఎన్నికలు గెలిచి చూపిస్తాం..కిషన్ రెడ్డి అడ్డుకుంటారా?' అని అన్నారు.

## గ్రీన్ కార్డు నిరీక్షణకు తెరదించనున్న అమెరికా..
# ప్రతిపాదనలతో కొత్త బిల్లు!

ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజు ప్రతిపాదించిన సర్కారు

20 వేల డాలర్లు చెల్లిస్తే గ్రీన్ కార్డు దరఖాస్తును వేగంగా పరిశీలిస్తామని వెల్లడి

గ్రీన్ కార్డు దరఖాస్తుల్లో బ్యాక్ లాగ్ క్లియర్ చేయడమే లక్ష్యమని వివరణ




ఢిల్లీ: అమెరికాలో గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుని సంవత్సరాలుగా వేచి చూస్తున్న వారికి ఊరట కల్పించేందుకు అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. నిర్ణీత మొత్తం చెల్లిస్తే దరఖాస్తును త్వరగా పరిశీలించే అవకాశం తీసుకురానుంది. ఇందుకు అనుగుణంగా పలు ప్రతిపాదనలతో బిల్లును సిద్ధం చేసిన ప్రభుత్వం.. త్వరలో చట్టసభల్లో ప్రవేశపెట్టనుంది. అమెరికాలో తాత్కాలిక వీసాలపై ఉంటున్న భారతీయులతో పాటు చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ పౌరులు గ్రీన్ కార్డు కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఆయా దేశాల నుంచి పెద్ద సంఖ్యలో వలసలు, ఏటా నిర్ణయించే కోటా తదితర కారణాలతో ఈ ఆలస్యం జరుగుతోంది.

డిగ్నిటీ యాక్ట్ ఆఫ్ 2025 బిల్లులో ఏముందంటే..

దశాబ్దాలుగా నలుగుతోన్న సమస్యకు పరిష్కారం చూపేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టామని సెనేటర్ మారియా ఎల్విరా సలజార్ పేర్కొన్నారు. గ్రీన్ కార్డ్ బ్యాక్ లాగ్‌లను క్లియర్ చేయడమే లక్ష్యంగా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీ విధానం తీసుకొస్తామని వివరించారు. పదేళ్లుగా గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నవారు ప్రీమియం ప్రాసెసింగ్ ఫీ (20 వేల డాలర్లు) చెల్లిస్తే అధికారులు వారి దరఖాస్తును త్వరగా పరిశీలిస్తారని చెప్పారు.

ఏటా ఏ కోటాలో ఎన్ని కార్డులంటే..?

తాత్కాలిక వీసాలపై అమెరికాలో ఉంటూ శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వం గ్రీన్ కార్డులు జారీ చేస్తుంది. ఫ్యామిలీ ప్రిఫరెన్స్ కోటాలో 2,26,000 గ్రీన్ కార్డులు, ఉపాధి ఆధారిత కేటగిరీలో 1,40,000 గ్రీన్ కార్డులను ఏటా జారీ చేస్తారు. అయితే, ఒక్కో దేశానికి నిర్ణీత సంఖ్య (కోటా)లో మాత్రమే వీటిని జారీ చేస్తుంటారు. మొత్తం దరఖాస్తుల్లో ఒక్కో దేశానికి కేవలం 7% మాత్రమే కేటాయించాలన్నది ప్రస్తుత విధానం. తాజా బిల్లులో దీనిని 15 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు.

# భారత్-రష్యా బంధం మరింత పటిష్ఠం..
## కీలక ఒప్పందంపై సంతకాలు

భారత్, రష్యా మధ్య కీలక పారిశ్రామిక ఒప్పందం

అల్యూమినియం, ఎరువులు, రైల్వేల్లో సహకారానికి అంగీకారం

గనుల రంగంలో టెక్నాలజీ బదిలీపై ప్రత్యేక దృష్టి

ఏరోస్పేస్, 3డీ ప్రింటింగ్ వంటి కొత్త రంగాల్లోనూ భాగస్వామ్యం

ఢిల్లీలో జరిగిన 11వ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో నిర్ణయం




ఢిల్లీ: భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యం మరో మెట్టు పైకెక్కింది. ఇరు దేశాలు పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు ఒక కీలక ప్రోటోకాల్‌పై సంతకాలు చేశాయి. అల్యూమినియం, ఎరువులు, రైల్వేలు, గనుల టెక్నాలజీ వంటి కీలక రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. న్యూఢిల్లీ వేదికగా ఇండియా-రష్యా వర్కింగ్ గ్రూప్ 11వ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భారత్ తరఫున పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా, రష్యా పక్షాన ఆ దేశ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఉప మంత్రి అలెక్సీ గ్రుజ్‌దేవ్ అధ్యక్షత వహించారు. ఈ భేటీలో ఇరు దేశాలకు చెందిన సుమారు 80 మంది ఉన్నతాధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, నిపుణులు పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల పురోగతిని ఈ భేటీలో సమీక్షించారు. ముఖ్యంగా అల్యూమినియం, ఎరువుల ఉత్పత్తి, రైల్వే రవాణా వ్యవస్థల అభివృద్ధిలో పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించారు. గనుల రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేసుకోవడం, నిపుణులకు శిక్షణ ఇవ్వడం, పారిశ్రామిక, గృహ వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. సంప్రదాయ రంగాలతో పాటు భవిష్యత్ టెక్నాలజీల్లోనూ కలిసి పనిచేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ, చిన్న విమానాల కోసం పిస్టన్ ఇంజిన్ల తయారీ, కార్బన్ ఫైబర్ టెక్నాలజీ, 3డీ ప్రింటింగ్ వంటి ఆధునిక రంగాల్లో అవకాశాలను అన్వేషించాలని తీర్మానించాయి. వీటితో పాటు అరుదైన ఖనిజాల వెలికితీత, భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ వంటి అంశాలపై కూడా చర్చలు జరిపారు. చర్చల అనంతరం ఇరు దేశాల ప్రతినిధులు సహకార ప్రోటోకాల్‌పై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం భారత్-రష్యా మధ్య పారిశ్రామిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

# చేనేత కళాకారుల ఆదాయం రెట్టింపు చేస్తా

మంగళగిరిలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

చేనేత కార్మికులు కాదు, కళాకారులంటూ మంత్రి లోకేష్ ప్రశంస

యువగళంలో ఇచ్చిన హామీలను నెరవేర్చామని వెల్లడి



అమరావతి: చేనేత కార్మికులను కేవలం కార్మికులుగా కాకుండా, అద్భుతమైన డిజైన్లు సృష్టించే కళాకారులుగా గౌరవిస్తానని, వారి ఆదాయాన్ని రెట్టింపు చేయడమే తన లక్ష్యమని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంగళగిరిలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం తన అదృష్టమని ఆయన పేర్కొన్నారు. గురువారం నాడు మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్ శాల వద్ద



నిర్వహించిన 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తుల స్టాళ్లను, మగ్గాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ, "దారానికి రంగు వేయడం నుంచి చీర నేసే వరకు నేతన్నలు పడే కష్టం నేను ప్రత్యక్షంగా చూశాను. అందుకే వారిని చేనేత కళాకారులుగా పిలుస్తున్నాను" అని అన్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, మంగళగిరి ప్రజలు తనను సొంత కుటుంబ సభ్యుడిలా ఆదరించారని గుర్తుచేసుకున్నారు. ఆ ఓటమి తనలో కసి పెంచిందని, ఐదేళ్లు ప్రజలకు అండగా నియోజకవర్గంలోనే పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే చేనేతలను ప్రోత్సహించడానికి 873 రాట్నాలను ఉచితంగా అందించామని, కరోనా కష్టకాలంలోనూ అండగా నిలిచామని లోకేశ్ వివరించారు. వీవర్ శాల ఏర్పాటు, టాటా తనేరా సంస్థతో ఒప్పందం వంటి చర్యల ద్వారా ఇప్పటికే చేనేతల ఆదాయం 30 శాతం పెరిగిందని, అయితే వారి ఆదాయం రెట్టింపు అయ్యేవరకు తాను సంతృప్తి చెందనని అన్నారు. స్వర్ణకారుల సంక్షేమం కోసం కూడా ప్రత్యేక సంఘం ఏర్పాటుచేసి ఆరోగ్య బీమా, ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. యువగళం పాదయాత్రలో చేనేతలను దత్తత తీసుకుంటానని చెప్పిన మాటను కొందరు ఎగతాళి చేశారని, కానీ చేనేత రంగాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఆ నిర్ణయం తీసుకున్నానని లోకేశ్ ఉద్ఘాటించారు. తన కుటుంబం మంగళగిరి చేనేత వస్త్రాలనే వినియోగిస్తుందని, జాతీయ నేతలను కలిసినప్పుడు మంగళగిరి శాలువాలనే బహూకరిస్తానని చెప్పారు. యువగళంలో చేనేతలకు ఇచ్చిన హామీలైన త్రిఫ్ట్ ఫండ్ పునరుద్ధరణ, చేనేత భరోసా కింద రూ.25వేల ఆర్థిక సాయం, స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలను సీఎం చంద్రబాబు సహకారంతో నెరవేర్చామని లోకేశ్ ప్రకటించారు. ముఖ్యమంత్రి సహకారంతో మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 200 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని లోకేష్ వివరించారు. 31 కమ్యూనిటీ హాళ్లు, మోడల్ లైబ్రరీ, నాలుగు లేన్ల రహదారి, 100 పడకల ఆసుపత్రి, భూగర్భ డ్రైనేజ్, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్, ఎయిమ్స్ అభివృద్ధి వంటి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకమ్మ, చిల్లపల్లి శ్రీనివాసరావు వంటి వారికి రాష్ట్రస్థాయి పదవులు ఇచ్చి తగిన గుర్తింపు కల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎస్. సవిత, సుచిత్ర ఎల్లా, పంచుమర్తి అనూరాధ, తమ్మిశెట్టి జానకీదేవి, పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నలను చంద్రబాబు సర్కార్ ఏ రకంగా ఆదుకున్నట్లు?: వైఎస్ జగన్



తాడేపల్లి: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సంత్ కబీర్ అవార్డు అందుకుంటున్న లక్క శ్రీనివాసులు (తిరుపతి), నేషనల్ హ్యాండ్‌లూమ్ అవార్డులు అందుకుంటున్న కర్నాటి మురళి (చీరాల), జుజారె నాగరాజు (పొందూరు)లకు ఆయన అభినందనలు తెలిపారు. "నేతన్నల జీవితాలు బాగుపడాలన్న ఉద్దేశంతో మా ప్రభుత్వ హయాంలో వారికి ప్రతి అడుగులోనూ అండగా నిలిచాం. మేనిఫెస్టోలో చెప్పినట్టుగా 'వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం' ద్వారా ప్రతి ఏటా రూ.24,000 నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ చేశాం. వైఎస్సార్ నేతన్న నేస్తం కింద రూ.969.77 కోట్లు, నేతన్నల పింఛన్ కోసం రూ.1,396.45 కోట్లు, ఆప్కోకు పాత బకాయిలు రూ.468.84 కోట్లు చెల్లించాం. అంతేకాదు వివిధ పథకాల ద్వారా నేతన్నలకు రూ.3,706.16 కోట్లు సాయం చేశాం. ఇది ఒక రికార్డు" అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. "నేతన్నలకు ఉచిత విద్యుత్, పవర్ లూమ్స్ కు రాయితీపై విద్యుత్ అందించాం. చేనేత వస్త్రాలకు ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించి నేతన్నల ఆదాయం పెంచేందుకు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. ఇలా ప్రతి అడుగులోనూ చేనేతలకు అండగా నిలిచాం. ఈ ప్రభుత్వం చేనేతలకు నడుస్తున్న పథకాలను ఆపేసి ఇచ్చిన హామీలను పూర్తిగా గాలికి వదిలేసింది. జీఎస్టీ రీయింబర్స్ చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు అమలు చేయలేదు. దీన్ని అమలు చేయాలంటే దాదాపు రూ.250 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని నేతన్నలు చెబుతున్నారు. రెండు బడ్జెట్‌లలో పెట్టింది సున్నా..పవర్‌లూమ్‌లకు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్‌లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అన్నారు. 14 నెలలు గడిచినా అమలు చేయలేదు. కరెంటు సబ్సిడీ ఇవ్వలేదు, కానీ కరెంటు ఛార్జీలు అమాంతంగా పెంచారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు రూ.19వేల కోట్ల మేర కరెంటు షాక్ ఇచ్చారు. మరి ఈ ప్రభుత్వం చేనేతలను ఏ రకంగా ఆదుకున్నట్లు?. పత్రికల్లో ప్రకటనలు తప్ప ఏమీ కనిపించడం లేదు. అన్ని వర్గాల మాదిరిగానే చంద్రబాబు చేనేతలను వంచించారు, మోసం చేశారు" అంటూ వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా నిలదీశారు.



# ట్రంప్ దెబ్బకు ఊగిసలాట...
## చివరికి స్వల్ప లాభాలతో గట్టెక్కిన స్టాక్ మార్కెట్

ట్రంప్ టారిఫ్ హెచ్చరికలతో మార్కెట్లలో తీవ్ర ఆందోళన

రోజంతా తీవ్ర ఒడుదొడుకులకు లోనైన స్టాక్ మార్కెట్లు

టెక్స్‌టైల్స్, జ్యువెలరీ రంగాలపై అమ్మకాల ఒత్తిడి

ఐటీ, బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగాల అండతో రికవరీ

స్వల్ప లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

డాలర్‌తో పోలిస్తే 87.67 వద్ద స్థిరంగా రూపాయి



ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త టారిఫ్ ప్రకటనల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు గురువారం తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. రోజంతా ఊగిసలాడిన సూచీలు, చివరి గంటలో బ్యాంకింగ్, ఐటీ రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో చివరికి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 79.27 పాయింట్లు లాభపడి 80,623.26 వద్ద స్థిరపడింది. అదేవిధంగా నిఫ్టీ 21.95 పాయింట్లు పెరిగి 24,596.15 వద్ద ముగిసింది. ఉదయం సెషన్లో ట్రంప్ ప్రకటనతో నష్టాల్లో ప్రారంభమైన సెన్సెక్స్, ఒక దశలో 80,262.98 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అయితే, మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్లు పుంజుకోవడంతో 80,737.55 గరిష్ఠ స్థాయిని కూడా తాకింది. "భారత దిగుమతులపై అదనంగా 25 శాతం సుంకం విధిస్తామన్న ట్రంప్ హెచ్చరికలతో మార్కెట్‌లో ఆందోళన నెలకొంది" అని పీఎల్ క్యాపిటల్ హెడ్ విక్రమ్ కసత్ తెలిపారు. దీని ప్రభావంతో అమెరికాకు ఎగుమతులు చేసే టెక్స్‌టైల్స్, జ్యువెలరీ, ఆటో విడిభాగాల రంగాల షేర్లు ఒత్తిడికి గురయ్యాయని ఆయన వివరించారు. అయినప్పటికీ, చివరి సెషన్‌లో బ్యాంకింగ్, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల్లో వచ్చిన కొనుగోళ్లు నష్టాలను పూడ్చాయని అన్నారు. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ సూచీ ఏకంగా 300 పాయింట్లు పెరగ్గా, బ్యాంక్ నిఫ్టీ 110 పాయింట్లు, ఆటో సూచీ 59 పాయింట్లు లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభపడగా, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. "ట్రంప్, పుతిన్, జెలెన్‌స్కీ మధ్య శాంతి చర్చలు జరగవచ్చనే వార్తలు రావడంతో సెంటిమెంట్ మెరుగుపడింది. ఇది అమెరికా వాణిజ్య వైఖరిని శాంతింపజేయవచ్చనే ఆశలను రేకెత్తించింది" అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ పేర్కొన్నారు. మరోవైపు, డాలర్‌తో రూపాయి మారకం విలువ స్వల్పంగా బలపడి 87.67 వద్ద స్థిరంగా కొనసాగింది.

# ఉప రాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

సెప్టెంబర్ 9న ఎన్నికలు, అదే రోజు ఓట్ల లెక్కింపు

నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 తుది గడువు


25న నామినేషన్ల ఉపసంహరణ

ఢిల్లీ: ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. సెప్టెంబర్ 9న ఎన్నికలు నిర్వహించనున్నట్టు చెబుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ రోజు నోటిఫికేషన్ విడుదల చేసింది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 21న చివరి తేదీగా ప్రకటించింది. 22న నామినేషన్ల పరిశీలన, 25న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. సెప్టెంబర్ 9న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు ఉంటుందని ఈసీ పేర్కొంది. ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ ధన్‌ఖర్ జులై 21న ఆరోగ్య కారణాలతో ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఈ పదవి ఖాళీ అయింది. ఆయన పదవీకాలం వాస్తవానికి ఆగస్టు 2027 వరకు ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం మధ్యంతర ఎన్నికల ద్వారా ఎన్నికైన వ్యక్తికి పూర్తి ఐదేళ్ల పదవీకాలం ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 66 ప్రకారం పార్లమెంటులోని ఉభయ సభల (లోక్‌సభ, రాజ్యసభ) సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ద్వారా ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతుంది. ఈ ఎన్నికలో ఎంపీలందరూ (ఎన్నికైనవారు, నామినేటైనవారు) పాల్గొంటారు. సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటు పద్ధతి ద్వారా ఈ ఎన్నికలు రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరుగుతాయి.

# మనకు అమృతం దక్కొచ్చు:
# ట్రంప్ టారిఫ్ ల పెంపుపై ఆనంద్ మహీంద్రా

సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకోవాలన్న ఆనంద్ మహీంద్రా

దీనికోసం భారత్ రెండు బలమైన అడుగులు వేయాలని సూచన



ఢిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంగా భారత్ పై సుంకాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతానికి పెంచారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలపై ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ నుంచి టారిఫ్ ల రూపంలో ఎదురైన సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకోవాలని ఆనంద్ మహీంద్రా అన్నారు. దీని కోసం భారత్ రెండు బలమైన అడుగులు వేస్తే... సుంకాల మథనంలో మనకు అమృతం దక్కే అవకాశం ఉందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రారంభించిన సుంకాల యుద్ధం కారణంగా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నట్టు కనిపిస్తోందని ఆనంద్ మహీంద్రా అన్నారు. జర్మనీ, ఫ్రాన్స్, కెనడా వంటి దేశాలు ట్రంప్ సుంకాల విధింపుతో సొంత వ్యూహాలకు పదును పెట్టాయని చెప్పారు. దీని ఫలితంగా ప్రపంచ అభివృద్ధికి కొత్త ఇంజిన్లు లభిస్తున్నాయని అన్నారు. భారత్ కూడా ఈ సంక్లిష్ట క్షణాలను అవకాశంగా మలుచుకోవాలని చెప్పారు. 1991లో మన దేశంలో నెలకొన్న విదేశీ మారక నిల్వల సంక్షోభంతో లిబరలైజేషన్ కు నాంది పడిందని తెలిపారు. ఇప్పటి పరిస్థితుల నుంచి అమృతం దక్కించుకోవడానికి భారత్ రెండు అడుగులు వేయాల్సి ఉందని చెప్పారు. ప్రపంచ పెట్టుబడులకు తిరుగులేని వేదికగా భారత్ అవతరించాలని సూచించారు. దీని కోసం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని వేగంగా మెరుగుపరచాలని అన్నారు. విదేశీ మారక నిల్వలను పెంచుకునేందుకు పర్యాటక రంగాన్ని శక్తిగా మలుచుకోవాలని చెప్పారు. టూరిజం వల్ల ఉపాధి కూడా పెరుగుతుందని అన్నారు. తయారీ రంగంపై దిగుమతి సుంకాలను క్రమబద్ధీకరించాలని సూచించారు.